ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	584.50 (295.9925)	4,09,921	4,09,921
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.73 (4.13)	3,190	4,368
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	166.20 (33.18)	3,87,101	3,81,796

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

సీఎంఆర్‌లో జాప్యం!



- మిల్లుల వద్దే 53 శాతం యాసంగి బియ్యం
- గోదాములు నిండిపోవడమూ ప్రధాన సమస్య
- సీఎంఆర్ బియ్యం సేకరణ పై సీరియస్‌గా దృష్టి పెట్టామంటోన్న అధికారులు

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలో జాప్యం జరుగుతోంది. బియ్యం నిల్వ చేయడానికి గోదాములు లేకపోవడమే అందుకు ప్రధాన కారణంగా అధికారులు, మిల్లర్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న గోదాములన్నింటిలో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు బియ్యం నిల్వ ఉంది. ఎఫ్‌సీఐ కోటా బియ్యం తరలిస్తే తప్ప గోదాముల్లో సీఎంఆర్ నిల్వ చేసే అవకాశం ఉండదని తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

గోదాముల్లో చేటు లేకపోవడంతో గత వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ ద్వారా రావాల్సిన బియ్యాన్ని సేకరించడంలో పకడ్బందీగా వ్యవహరిస్తున్న అధికారులు రబీ బియ్యానికి సంబంధించి మిల్లులపై ఒత్తిడి తేలేకపోతున్నారు. ఈ సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించే నిమిత్తం ఎఫ్‌సీఐ బియ్యం తరలించాలని లేఖలు రాయడంతో పాటు, ఉన్నతాధికారులకు సైతం పరిస్థితిని వివరించామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

యాసంగి సీఎంఆర్ 53శాతం మిల్లర్ల వద్దే

జిల్లాలో సీఎంఆర్ బియ్యం వెనక్కితెప్పించడంలో జాప్యం జరుగుతోంది. గడిచిన వానాకాలానికి సంబంధించి 2,75,840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఇవ్వగా, అందుకు 1,86,158 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు 91 శాతం అంటే 1,68,866 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్‌కు చేరగా, ఇంకా 9శాతం బియ్యం అంటే 17,292 మెట్రిక్‌టన్నులు రావాల్సి ఉంది. ఈ బియ్యాన్ని సేకరించడంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించడం వల్లే పురోగతి సాధ్యమైందని చెబుతున్నారు. మొత్తం వచ్చే సెప్టెంబరు 12 నాటికి ఈ బియ్యాన్ని నిల్వ చేయాలని నిర్ణయించారు. అయితే యాసంగి సీజన్‌కు సంబంధించి మాత్రం పురోగతి లోపించింది. యాసంగిలో మిల్లులకు 6,03,305 మెట్రిక్‌టన్నుల ధాన్యం కేటాయించగా, అందుకు 4,07,731 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు 47శాతం అంటే 1,92,069 మెట్రిక్‌టన్నుల బియ్యం రాగా, ఇంకా 53శాతం బియ్యం 2,15,662 మెట్రిక్‌టన్నుల బియ్యం సీఎంఆర్ కోటా కింద రావాల్సి ఉంది. ఈ బియ్యానికి సంబంధించిన ధాన్యం మిల్లుల వద్ద పేరుకుపోయింది. మిల్లర్లు బియ్యం ఇస్తే గోదాముల్లో నిల్వచేసే పరిస్థితి లేదని, అందువల్లే అధికారులు మిల్లులపై ఒత్తిడి తేలేకపోతున్నారని చెబుతున్నారు.

ప్రైవేట్ గోదాములైనా తీసుకోవాలని డిమాండ్

జిల్లాలో నాలుగైదు సీజన్లుగా యాసంగిలోనూ దొడ్డురకాల ధాన్యం భారీగా వస్తోంది. ఆ ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్న సివిల్‌సప్లయిస్ సంస్థ సీఎంఆర్ ద్వారా బియ్యంగా మార్చి తిరిగి ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయిస్తుంది. ఎఫ్‌ఐసీ నుంచి ఆర్డర్లు తీసుకోవడం, తీసుకున్న ఆర్డర్ ప్రకారం బియ్యాన్ని పంపేందుకు అవసరమైన రైల్వే ర్యాకులు తెప్పించడంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ సంస్థ, కేంద్ర ఎఫ్‌సీఐ మధ్య సమన్వయలోపం ఎదురవుతోంది. దీంతో జిల్లాలో బియ్యం నిల్వలు పేరుకుపోవడంతో ప్రస్తుతం గత యాసంగికి సంబంధించిన సీఎంఆర్ కోటా బియ్యం మిల్లుల నుంచి

- మిగతా 8వ పేజీలో...

ఇక జీవాలకు టీకాలు

- 26 నుంచి సెప్టెంబరు 10వరకు టీకాలు
- పశువైద్య సిబ్బందితో 54 బృందాల ఏర్పాటు

జిల్లాలో గొర్రెలు, మేకల్లో పీపీఆర్ (పారుడు) వ్యాధి నివారణకు టీకాలు వేసేందుకు పశుసంవర్ధకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 12లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. పీపీఆర్ వ్యాధి నివారణకు వ్యాధి నిరోధక టీకాలను ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు జిల్లాలోని అన్నిగ్రామాల్లో పంపిణీ చేయనున్నారు. అందుకు పశువైద్య సిబ్బందితో 54బృందాలు ఏర్పాటుచేశారు. ప్రతీ బృందంలో పశు వైద్యుడితోపాటు సిబ్బంది ఉంటారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పీపీఆర్ వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధితోవల్ల గొర్రెలు, మేకల మరణాలు సంభవించే అవకాశాలు అధికం. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందు జాగ్రత్తగా టీకాలు వేయించేందుకు నిర్ణయించింది. ఈ టీకాలతో జీవాలను వ్యాధి నుంచి కాపాడవచ్చు. పీపీఆర్ అనేది వైరల్ డయోరియా వంటింది. ఈ టీకాలపై జీవాల పెంపకందారులకు పశు వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.



వ్యాధి వ్యాప్తి చెందుతుందిలా..

గొర్రెలు, మేకల్లో పారుడు రోగం అంటు వ్యాధిలా సోకుతుంది. జీవాలకు సరైన గాలి, వెలుతురు అందకపోవడం, కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడంతోపాటు వర్షాల కారణంగా వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధిగ్రస్థ జీవాలను కొనుగోలు చేసి మందలో కలపడం వల్ల ఇతర జీవాలకు ఇది సోకుతుంది. అదేవిధంగా వ్యాధిగ్రస్థ జీవాలు విసర్జించే పేడ, స్రావాల వల్ల ఇతర జీవాలకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో అధిక జ్వరం రావడం, కళ్ల, ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పొక్కులు ఏర్పడటం, జిగురుతో కూడిన విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరితే ముక్కు నుంచి చీము కారడం, నోటిలోని చిగుళ్లపై, నాలుకపై పుండ్లు పడటం వంటివి జరుగుతాయి.ఆకలి మందగించడం, మేత మేయకపోవడం, అధిక విరేచనాలతో పాటు దగ్గుతో కూడిన బ్రాంకో నిమోనియా వంటి లక్షణాలతో 5 నుంచి 10 రోజుల్లో జీవాలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. చనిపోయిన జీవాలకు శవపరీక్ష చేసినప్పుడు చిన్న పేగులు, పెద్ద పేగుల్లో రక్తపు చారలు కనిపిస్తాయి. దీని ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. శ్వాసకోశ జీర్ణవ్యవస్థకు సంబంధించిన లక్షణాల ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చు. వ్యాధిగ్రస్థ

- మిగతా 8వ పేజీలో...

డ్రగ్స్ జీవితానికి అవరోధం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయికి బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వాడినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో 25 మందిపై డ్రగ్స్ కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కసారి డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ జరిగి కేసు నమోదైతే భవిష్యత్‌లో వారు ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులు కాదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా రోడ్ క్రాసింగ్ వద్దనే చోటుచేసుకున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసశాఖపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, గ్లింపింగ్ లైట్లు వేయిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. సదస్సులో సీఐ, ఎస్‌ఐలు కే.నాగరాజు, దగ్గుల క్రాంతికుమార్, డీటీఆర్‌సీ సీఐ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల పాటలు ఆలోచింపజేశాయి.

మహిళా పోలీస్ సిబ్బందికి ఆత్మరక్షణ శిక్షణ

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): మహిళా పోలీస్ సిబ్బందికి ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇస్తున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సెల్ఫ్ డిఫెన్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా పోలీస్ సిబ్బంది పురుష సిబ్బందితో సమానంగా ప్రజల్లోకి వెళ్లి విధులు నిర్వహించే సమయంలో వారికి ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ సీఐ రాము, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, ఆర్‌ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు డీజే ఏర్పాటుకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డుకు ఇరు పక్కల ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హాలియా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాను విజయవంతంచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాగార్జునసాగర్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా హాలియా సాయిమందిరంలో ఆయనకు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయిమందిరంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి సాయినాథుడి వెండి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వజ్రతేజ రైస్‌మిల్లును ఆయన సందర్శించారు. ఆయనకు యజమాన్యం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించింది. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు తేలపోలు శేఖర్, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు బానావత్ సక్రునాయక్, శివకుమార్, జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, బిక్షంరెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, ఎంతపోలు కృష్ణమూర్తి, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పథకంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



బొడ్డుపల్లి పీహెచ్‌సీలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రాథమిక ఆదాయం కలిగిన 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న కుటుంబ పెద్ద సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.20వేల వరకు ఆ కుటుంబానికి సాయం అందుతుందన్నారు. అంత్యోదయ, అన్న బీమాయోజన, జనశ్రీ బీమాయోజన కింద లబ్ధిపొందినవారు ఈ పథకానికి అర్హులుకాదన్నారు. పథకం కింద లబ్ధిపొందేందుకు దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. దరఖాస్తుతోపాటు మరణించిన వ్యక్తికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత గుర్తింపు పత్రం, చిరునామా రుజువు, తెల్లరేషన్‌కార్డు, జతచేయాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద జిల్లాకు 3,500 మందికి లబ్ధిచేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో టాంటాం వేయించి, అర్హుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని కోరారు. అందుకు తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ప్రారంభించాలన్నారు. దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి ఆర్డీవోకు సమర్పించాలని, ఆర్డీవోలు ఆన్‌లైన్‌లో డీఆర్‌వోకు పంపించాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తం వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

గ్రామీణ ప్రాంత ప్రజలకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యులను ఆదేశించారు. శనివారం మండలంలోని బొడ్డుపల్లి ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, ఈఎన్‌సీ, రిస్క్ రిజిస్టర్, ఐరన్, ఫోలిక్ మాత్రాల పంపిణీ, ప్రసవాలు, సీజనల్ వ్యాధుల వివరాలను డాక్టర్ విజయను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ముదిగొండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. కిచెన్‌లో నుంచి వెళ్లే వృథా నీటి కోసం ఓపెన్ డ్రైనేజీ ఉండడం, మురుగునీటి ఓపెన్ డ్రైనేజీ ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రిన్సిపాల్ హనుమాకుమారిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

● యూరియా కోసం బారులు



నిడమనూరు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం బారులుతీరిన రైతులు 7

సాగులో అధికారుల సూచనలు పాటించాలి



రాజవరం గ్రామంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో వ్యవసాయాధికారులు, నిపుణుల సూచనలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే కంపాసాగర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగయ్య, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీధర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ తెలిపారు. శనివారం స్థానిక మండల వ్యవసాయాధికారి గంటా హర్షితతో కలిసి మండలంలోని రాజవరం గ్రామంలో పర్యటించి రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం వరిపంట దుబ్బు చేసే దశలో ఉన్నందున కలుపు నివారణకు ట్రోపోమోన్ 20శాతం, ఇథోక్సీ సల్ఫ్యూరాన్ 800 గ్రాములను ఎకరానికి లేదా సైహలోఫాప్ బ్యూటైల్, పెనాక్యులమ్ 40మి.లీ ఎకరానికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పచ్చదోమ నివారణకు థయోమిథాక్సమ్ లీటర్ నీటికి 0.25గ్రాములు, లేదా లీటర్ నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.3మి.లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో కలుపు నివారణకు రెండు నుంచి మూడు ఆకులు ఉన్న దశలో క్విజలోఫాప ఇథైల్ 2మి.లీ లేదా పైరిథైయోబాక్ సోడియం 1.25మి.లీను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే కలుపును నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరతకు

కేంద్రమే కారణం

ఎంపీ చామల



నార్కట్‌పల్లి-మాండ్ర బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల

నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ అలసత్వమే కారణమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి నుంచి మాండ్ర వరకు సుమారు రూ.14కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, కట్టంగూరు, నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్వో ప్లాంట్లను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా తన కోటా నిధుల కింద స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలో యూరియా కొరతపై పార్టీ ఎంపీ ప్రియాంకగాంధీతో కలిసి ఎంపీలు చేసిన ధర్నా ఫలితంగానే 50వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి కేటాయించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చపెడతామంటే కేసీఆర్‌కు భయమెందుకని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులకు చెందిన సీఎస్ఆర్ కింద అంబులెన్స్‌లు, ఆస్పత్రులకు కావాల్సిన వసతులను సమకూర్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నార్కట్‌పల్లి మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. నార్కట్‌పల్లి పెద్ద చెరువును రూ.30కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామన్నారు. చెర్వుగట్టు దేవస్థానాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మార్కెట్ వైస్‌చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, ఎస్‌కే.సమద్, దొండ రమేశ్, అల్గాసు మహేశ్, రాజు, ప్రజ్ఞాపురం సత్తి, మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య రెడ్డిపల్లి సాగర్, అయితగోని నర్సింహ, శివశంకర్, రాజు, వెంకన్న, పరమేష్, శేఖర్, నారాయణ, స్వామి, గుత్తా మంజుల మాధవరెడ్డి, చెవుగోని రజిత శ్రీనివాస్, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఊసే లేని సీసీఎంబీ

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పాలనుకున్న సీసీఎంబీ(సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ)పరిశోధ కేంద్రం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. సీసీఎంబీ పరిశోధన కార్యక్రమాలను విస్తరించాలని భావించి 2009లో అప్పటి కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ రంగాపూర్‌లో అప్పటికే నెలకొల్పిన నిమ్స్‌కు సమీపంలో మానవ కణాల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు రూ.1000 కోట్లు మంజూరు చేసింది. కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించిన భూములపై కోర్టు స్టే ఇవ్వడంతో సేకరణ నిలిచింది.
- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



- బీబీనగర్‌లో ఏర్పాటుకు 2009లో ప్రయత్నాలు
- రూ.1000కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- భూసేకరణకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ
- నార్నే సంస్థ కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిన భూసేకరణ
- 16ఏళ్లుగా ప్రాజెక్టు ఏర్పాటుపై స్పష్టత కరువు

హైదరాబాద్‌లోని సీసీఎంబీకి అనుబంధంగా మానవకణాల పరిశోధన జరిపేందుకు విస్తరించాలని 2009లో అప్పటి కేంద్రం భావించింది. హైదరాబాద్ చేరువలో బీబీనగర్ రంగాపూర్‌లో అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన నిమ్స్ (ప్రస్తుతం ఎయిమ్స్)పక్కనే సీసీఎంబీ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.1000కోట్లు మంజూరు చేసి భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపమని కోరింది. ఈ క్రమంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఎయిమ్స్‌కు ఎదురుగా సర్వే నెంబర్ 42నుంచి 52, 54 నెంబర్లలో 184.06 ఎకరాల భూమిని కేటాయించేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఇందులో సర్వే నెంబర్ 42లోని 10ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటికే రెవెన్యూ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీకి కేటాయించారు. దాంతో సర్వే నెంబర్ 43 నుంచి 52, 54లో రెవెన్యూ రికార్డుల్లో భూదాన్, గ్రామదాన్ కింద నమోదై ఉన్న 146.38ఎకరాల భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రచురించింది. అప్పటి జిల్లా రెవెన్యూ అధికారులు భూసేకరణకు అవసరమైన చర్యలు ప్రారంభించారు. నాటి కలెక్టర్ ముక్తేశ్వర్‌రావు సీసీఎంబీ డైరెక్టర్‌తో కూడా సమీక్ష నిర్వహించారు.

కోర్టు స్టేతో నిలిచిన సేకరణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూకేటాయింపు ప్రక్రియను మొదలుపెట్టింది. కాగా సీసీఎంబీ కోసం గుర్తించిన భూములు అప్పటికే నార్నే ఎస్టేట్ సంస్థ ఆధీనంలో ఉండడంతో భూసేకరణ ఆపాలని కోరుతూ కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో భూసేకరణ నిలిచింది. కాగా రెండేళ్ల తర్వాత అధికారులు భూసేకరణ మొదలు పెట్టినట్లు పెట్టి ఏ కారణంగానో నిలిపివేశారు. 16ఏళ్లు గడుస్తున్నా ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువరించలేదు. దీంతో సీసీఎంబీ లాంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ ప్రాజెక్టు అటకెక్కినట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరిహారం సొమ్ము జమ

జాతీయ సంస్థ సీసీఎంబీ కోసం సేకరించిన భూములకు అప్పటి రెవెన్యూ అధికారులు ఎకరాకు రూ.1.50లక్షలుగా మార్కెట్ విలువను నిర్ణయించారు. దాని ప్రకారం ముందుగా రూ.4.20కోట్లు డిపాజిట్ చేయాలని సీసీఎంబీని కోరగా అందుకు రూ.2.60కోట్లు 2009 ఫిబ్రవరిలో అప్పటి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీసీఎంబీ డిపాజిట్ చేసింది.

ఆసక్తి చూపని అప్పటి పాలకులు

సీసీఎంబీ లాంటి జాతీయ సంస్థను తెలంగాణ ప్రాంతంలో నెలకొల్పడంపై అప్పటి పాలకులకు ఇష్టం లేదనే ఆరోపణలు వినిపించాయి. అప్పటికే తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం ఉద్యమం కొనసాగుతున్న నేపథ్యం కూడా అందుకు కారణమని ప్రచారం సాగింది. అందువల్లే నార్నే సంస్థకు వ్యతిరేకంగా కోర్టులో వాదనలు వినిపించకపోగా పరోక్షంగా ఈస్ట్‌సిటీ సంస్థకు సహకరించారని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోని తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఇవే వాదనలను నాటి తెలంగాణ ఉద్యమ నేతలు వ్యక్తపరిచారు.

ప్రత్యేక రాష్ట్రంలోనూ అదే తీరు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీసీఎంబీ ఏర్పాటవుతుందని భావించారు. రాష్ట్రం సిద్ధించి ఏళ్లగడిచినా సీసీఎంబీ లాంటి జాతీయ సంస్థ ఏర్పాటు కోసం పట్టించుకోలేదన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమమయ్యాయి. 2009లో మంజూరైన సీసీఎంబీ కేంద్రం భూసేకరణ వద్ద ఆగిపోయింది. 16ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టును నెలకొలిపే అంశంపై ప్రభుత్వాలు నేటికి చర్యలు తీసుకోకపోవడంతో సీసీఎంబీ ఉన్నట్టా.. లేన్నట్టా అనే సందిగ్ధం స్థానికుల్లో నెలకొంది.

ప్రాజెక్టు తాజా పరిస్థితిపై ఆరా తీస్తా



యాదాద్రిభువనగిరి జిల్లాలో నెలకొల్పాలనుకున్న సీసీఎంబీ పరిశోధన కేంద్రం ఏర్పాటుపై సంబంధిత సీసీఎంబీ అధికారులను సంప్రదించి వివరాలు తీసుకుంటాం. ప్రాజెక్టు ఏర్పాటు కోసం గత ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, ప్రాజెక్టు ముందడుగు వేయలేకపోవడానికి కారణాలు, తాజా పరిస్థితిపై ఇటు జిల్లా అధికారులు అటు సీసీఎంబీ అధికారుల ద్వారా తెలుసుకుని తదుపరి చర్యలపై దృష్టి సారిస్తాం.

- చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఎంపీ భువనగిరి



భూసేకరణను అడ్డుకున్న నార్నే సంస్థ

బీబీనగర్ రంగాపూర్‌లో సీసీఎంబీ కొరకు ప్రభుత్వంగుర్తించిన భూములు అప్పటికే నార్నే ఎస్టేట్(ఈస్ట్ సిటీ) రియల్ సంస్థ ఆధీనంలో ఉండగా కొంత భూమిలో లే అవుట్‌లు చేసి ప్లాట్లను విక్రయించింది. దాంతో భూసేకరణ ఆపాలని కోరుతూ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంది. దాంతో భూసేకరణ నిలిపివేశారు. రెండేళ్ల తర్వాత కోర్టు భూసేకరణ ప్రక్రియను కొనసాగించుకోవచ్చునని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులతో తిరిగి భూసేకరణ పనులు మొదలుపెట్టిన అధికారులు ఈసారి పరిహారం కింద ఎకరాకు రూ.7.10 లక్షల చొప్పున మార్కెట్ విలువను నిర్ధారించారు. ప్రతిపాదిత మార్కెట్ విలువలో 80శాతం డిపాజిట్ చేయాలని సీసీఎంబీకి సూచించారు. అయితే అంతకుముందు ఎకరాకు లక్షన్నర పరిహారం ప్రతిపాదించినప్పుడే అభ్యంతరాలు తెలిపిన సీసీఎంబీ ప్రతిష్టాత్మక జాతీయ ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకుని పరిహారం చెల్లింపులో మినహాయింపు ఇవ్వాలని కోరింది. అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

చివ్వెంల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిందితుల వివరాలు వెల్లడించారు. చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు కాగా రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మయ్య భార్య వెంకటమ్మతో దండుగుల శేఖర్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో పెద్దమనుషులు పంచాయితీ చేసి ఎవరికి వారు ఉండాలని నిర్ణయించారు. తీర్మానం మేరకు అలాగే ఉంటున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మయ్యకు రాళ్లు కొట్టే వ్యాపారంలో పల్లపు గోపితో వివాదం మొదలైంది. దీంతో శేఖర్, గోపీలు కలిసి లక్ష్మయ్యను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం వారి స్నేహితులైన సూర్యాపేట రూరల్ మండలం టేకుమట్ల నివాసి పల్లపు రాము, రాయినిగూడెం గ్రామానికి చెందిన పసుపుల చంటి సహాయంతో హత్యకు ప్రణాళిక వేశారు. రాళ్లు కొట్టిన డబ్బులు తిరిగి ఇస్తానని గోపీ ప్లాన్ ప్రకారం చివ్వెంల మండలంలోని బీబీగూడెం వద్దకు ఈ నెల 22న లక్ష్మయ్యను రమ్మన్నాడు. అక్కడికి వచ్చిన లక్ష్మయ్యకు చెప్పిన ప్రకారం డబ్బులు ఇవ్వలేదు. దీంతో లక్ష్మయ్య, తన భార్యలతో కలిసి ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో కారులో వెంబడించిన శేఖర్, గోపి, రాము, చంటి బీబీగూడెం శివారులోని మధుర వైన్స్ వద్ద దాడికి యత్నించారు. గమనించిన లక్ష్మయ్య అతడి భార్యలు వైన్స్‌లోకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతరం కారులో వచ్చిన నలుగురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సూర్యాపేట సమీపంలోని సుందరయ్యనగర్‌లో గోపి, మిగతా ముగ్గురు సూర్యాపేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారు ఉపయోగించిన ఏపీ07బీక్యూ 1789 కారుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

జైకేసారం ఎస్‌ఆర్ ల్యాబ్ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు

● ఎగిసిపడిన మంటలు, పరుగులు తీసిన కార్మికులు ● తప్పిన ప్రమాదం



చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం పరిధిలోని ఎస్‌ఆర్ ల్యాబ్ పరిశ్రమలో శనివారం రాత్రి సుమారు 9.30గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బల్క్ డ్రగ్స్ తయారుచేసే కంపెనీలో ఓ బ్లాకులో రియాక్టర్ పేలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు ప్రాణభయంతో బయటికి పరుగుపెట్టారు. రియాక్టర్ పేలుడు తాకిడికి పక్కన ఉన్న బ్లాకునకు కూడా మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాద సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను ఆర్పారు. కార్మికులంతా బయటికి పరిగెత్తడంతో ప్రాణనష్టం తప్పింది. కంపెనీలో సుమారు 40 మంది వరకు పనిచేస్తుండగా, నైట్ షిఫ్ట్ కావడంతో 10మంది కార్మికులే పరిశ్రమలో పనిచేస్తున్నారు. పేలుడు కారణంగా పెద్ద ఎత్తున పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల ఏం జరిగిందేమోనని గ్రామస్థులు కంపెనీ వద్దకు తరలివచ్చారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు.

రూ.లక్షకు బదులు ఒక్క రూపాయి జమ

- పుట్టపాక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆందోళన
- నిర్ధారణ కోసం రూ.1 జమ చేశామంటున్న అధికారులు
- సాంకేతిక కారణాలతో పలువురికి బిల్లుల చెల్లింపులో జాప్యం

(ఆంధ్రజ్యోతి-సంస్థాన్‌నారాయణపురం)

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో ముందుకు సాగటంలేదు. లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టినా సకాలంలో బిల్లులు రాక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పునాదివరకు ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులకు లక్ష రూపాయలకు బదులు వారి ఖాతాలో కేవలం ఒక్క రూపాయి జమకావటంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలానికి 473ఇళ్లు మంజూరయ్యాయి. వారందరూ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇదే క్రమంలో మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన లబ్ధిదారులు సైతం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి పునాది వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఫొటోలు కూడా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ప్రతీ సోమవారం లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం బిల్లులు అందాల్సి ఉంది. కానీ బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. దీంతో బిల్లుల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అప్పులు చేసి నిర్మాణాలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావటంతో లబ్ధిదారులు అప్పులు చేసి ఇంటి నిర్మాణాలను చేపట్టారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తున్నారు. మొదటి దశలో భాగంగా పునాది వరకు నిర్మిణం పూర్తయిన వారికి ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాల్సి ఉంది. కార్యదర్శి నిర్మాణం పూర్తయిన వారి పనుల ఫొటోలు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రతీ సోమవారం ప్రాధాన్య క్రమంలో బిల్లులు మంజూరు చేస్తారు. ఈ రకంగా ఫొటోలు తీసి రోజులు గడుస్తున్నా చాలా మందికి బిల్లులు పడటం లేదు. బ్యాంక్ ఖాతా నెంబరు, ఆధార్ కార్డు నెంబరు ఐఎఫ్‌సీ కోడ్ నెంబర్లలో పొరపాట్లు జరగటంతో కొందరికి ఆలస్యం అవుతోందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు పునాది వరకు నిర్మాణం పూర్తి చేశారు. వారికి ఖాతాలో లక్ష రూపాయలు జమ కావాల్సి ఉండగా అందుకు బదులుగా రూపాయి మాత్రమే జమైంది. దీంతో వారిలో ఆందోళనమొదలైంది.

నిర్ధారణ కోసమే రూపాయి జమ

మండలంలో పునాది వరకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన కొందరు లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో వారి ఖాతాలో డబ్బులు జమ కాలేదు. బ్యాంకు ఖాతా నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, ఐఎఫ్‌సీ కోడ్ నెంబర్లలో లోపాలు ఉన్నాయ్. వాటిని సరిచేసేందుకు కొంతసమయం పడుతోంది. అలాంటి వారికి ఖాతాల్లో ముందుగా ఒక్క రూపాయి జమ చేస్తాం. ఆ ఒక్క రూపాయి జమ అయ్యిందా కాలేదా అన్న వివరాలను లబ్ధిదారుడితో మాట్లాడి నిర్ధారించుకుంటాం. ఆ తర్వాత రూ.లక్ష వారి ఖాతాలో జమచేస్తాం. అంతే తప్పా లక్షకు బదులు ఒక్క రూపాయినే జమ అవుతుందని ప్రచారం చేయటం సరికాదు.

ప్రమోద్‌కుమార్, ఎంపీడీవో

వల పన్నినా తప్పించుకున్న దొంగ

మిర్యాలగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం చేసిన వ్యక్తిని గుర్తించి రెడ్‌హ్యాండ్‌గా పట్టుకునేందుకు ఇరుగుపొరుగు సహకారంతో దుకాణ యజమాని వలపన్నాడు. అయినా చిక్కకుండా తప్పించుకపోయిన సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడలోని ప్రకాశ్‌నగర్‌లో వెంకటేష్ అనే అతడు శ్రీమురళీ కృష్ణ ఔషధాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అతడి వద్దకు ఓ 25 ఏళ్ల యువకుడు 10 రోజులకోసారి వచ్చి మందులు కొనుగోలు చేస్తున్నాడు. ఈ నెల 12న వెంకటేష్ తన దుకాణ షట్టర్‌ను కిందికి దించి మధ్యాహ్నం 2.30గంటలకు భోజనానికి ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో మందులు కొనుగోలు కోసం ఓ వ్యక్తి దుకాణం వద్దకు వచ్చాడు. పక్కనే వున్న కర్రీపాయింట్ వారిని ఔషధాల దుకాణ యజమాని ఎప్పుడు తెరుస్తారని అడిగాడు. తమకు తెలియదని వారు తెలిపారు. అయినా ఆ వ్యక్తి వెళ్లకుండా అక్కడే ఫోన్ మాట్లాడుతున్నట్లు నటించి దుకాణ షట్టర్‌ను ఎత్తి దుకాణంలోని రూ.2,500 నగదును, ఔషధాలను చోరీ చేసి వెళ్లిపోయాడు. గంట తరువాత దుకాణానికి తిరిగి వచ్చిన వెంకటేష్ చోరీ జరిగినట్లు గుర్తించి చుట్టుపక్కల వారిని విచారించాడు. తరుచూ ఔషధాల కోసం వచ్చే వ్యక్తే ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్నాడు. ఈ పర్యాయం వస్తే పట్టుకునేందుకు వలపన్నాడు. ఇందుకోసం చుట్టుపక్కల వారికి చెప్పి రహస్యంగా గమనిస్తున్నారు. ఎప్పటిమాదిరే ఈ నెల 22న వెంకటేష్ దుకాణ షట్టర్‌ను కిందకు దించి తాళం వేయకుండానే ఇంటికివెళ్లాడు. మధ్యాహ్నం 2.45లకు సదరు అనుమానితుడు వచ్చి గతంలో లాగానే ఆరా తీశాడు. అనంతరం ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ తిరుగుతుండటంతో కర్రీపాయింట్ యజమాని సూరిబాబు గమనించి సమీపంలోని కిరాణం యజమాని నర్సింహారెడ్డికి సమాచారమిచ్చారు. వారిద్దరూ అతడి కదలికలను గమనించారు. అనుమానితుడు ఔషధ దుకాణ దుకాణ షట్టర్‌ను దించి లోపలికి వెళ్తుండగా సమీపంలో బేకరీ నిర్వహిస్తున్న మహిళ చాటుగా సెల్‌లో వీడియో తీసింది. అనుమానితుడు షట్టర్‌ను 80శాతం వరకు కిందకు దించి లోపలికి వెళ్లాడు. ఇదే అదును భావించి చుట్టుపక్కల వారు షట్టర్‌ను పూర్తిగా కిందకు దించి యజమానికి ఫోన్‌చేశారు. వెంకటేష్ వచ్చి షట్టర్ తీసి దొంగకోసం వెతకగా అనుమానితుడు కనిపించలేదు. దుకాణం వెనకవైపు ఉన్న డోరు గడియను తొలగించి గోడపైకి ఎక్కి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూకి పరారైనట్లు గుర్తించి అవాక్కయ్యారు. వెనక వైపు కాపాలా పెట్టడం మరిచిపోయామని యజమాని వెంకటేష్ వాపోయారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిసింది.



ఔషధ దుకాణ షట్టర్‌ను ఎత్తి లోపలికి ప్రవేశిస్తున్న అనుమానిత యువకుడు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తిప్పర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా తిప్పర్తి రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ-రాయినిగూడెం స్టేషన్ల మధ్యలో సుమారు(50) ఏళ్ల వ్యక్తి చెన్నై ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి కుడికాలు తొలగించి ఉందని, చికిత్స పొందుతున్న దుస్తువుల్లోనే మృతిచెందినట్లు అన్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ఆక్రమిత స్థలంలో దుకాణాలను తొలగించాలి

నల్లగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కన్నెకల్‌లో గ్రామపంచాయతీ కార్యాలయం, పోస్టాఫీస్, హైస్కూల్ ముందున్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని వాటిని తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. విలువైన ప్రభుత్వస్థలం కబ్జా చేశారని, ఈ దుకాణాలను తొలగించి స్వాధీనం చేసుకోవాలన్నా రు. ఈ విషయమై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, డీపీవోకి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెలలో రెండుపర్యాయాలు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదుచేశామన్నారు. తక్షణం ఈ దుకాణాలను తొలగించి ప్రభు త్వం స్వాధీనం చేసుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్థులు మాజీ సర్పంచ్ వెంకన్న, చిట్యాల వెంకన్న, శంకర్, శ్రీరాములు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

శాలిగౌరారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసి ఆర్‌ఐ అజారుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్, రాష్ట్ర నాయకులు భవన మధుసూదన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేష్, మండల కార్యదర్శులు చాడ శ్యాంసుందర్ రెడ్డి, భాష బోయిన వెంకన్న పాల్గొన్నారు.

అనుమతి లేని సిగరేట్ ప్యాకెట్లు స్వాధీనం

మోత్కూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని మహాదేవ్ మార్వాడి హోల్‌సేల్ కిరాణం దుకాణాన్ని శనివారం ఎస్‌వోటీ పోలీసులు తనిఖీ చేశారు. దుకాణంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న 'నంబరు 10' సిగరెట్లను గుర్తించారు. సుమారు 150 సిగరెట్టు ప్యాకెట్లను వారు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. దుకాణాల్లో అనుమతి లేని వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ముగిసిన శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు



శ్యాంసుందర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు, శ్యాంసుందర్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)

నూతనకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సీబీఐటీ, ఎంజీఐటీ కళాశాలల వ్యవస్థాపకుడు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు స్వగ్రామంలో శనివారం ముగిశాయి. అంతమయాత్రలో 3వేల మందికి పైగా ఆయన అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు శ్యాంసుందర్‌రెడ్డి మృతదేహాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యాంసుందర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండగా వారికి వ్యతిరేకంగా సోదరుడు జెన్నారెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి పోరాడి కాంగ్రెస్‌కు కంచుకోటగా మలిచారన్నారు. ఆ ఘనత వారి సోదరులకే దక్కిందన్నారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాలలు సీబీఐటీ, ఎంజీఐటీలను స్థాపించి ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన మహనీయుడు శ్యాంసుందర్‌రెడ్డి అని అభివర్ణించారు. సమితి ప్రెసిడెంట్‌గా ఈ ప్రాంతంలో ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. మామిడి తోటల సాగుతో ఈ ప్రాంత రైతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అంతిమయాత్రకు భారీగా అభిమానులు తరలివచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, తుంగతుర్తి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు తీగల గిరిధర్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఓపెన్'గా సేవాగుణంతో ముందుకు..

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఒకే పాఠశాలలో చదివిన కొందరు కలిసి సేవాగుణంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం ఓపెన్-ఐస్ సొసైటీని స్థాపించి సేవాతత్పరతను చాటుకోవడవంతో పాటు పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మట్టి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)



గత ఏడాది మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఓపెన్-ఐస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు (ఫైల్)

హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన అన్నదమ్ములు సులువ శ్రీనివాస్, చంద్రశేఖర్ కలిసి వారు చదువుకున్న ఎన్‌ఎస్‌పీ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు సుమారు 170 మందితో కలిసి ఓపెన్-ఐస్ సొసైటీని స్థాపించారు. ఆపదలో ఉన్న వారికి ఇతోధిక సహాయం అందిస్తూనే పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ సేవలోను ఆధ్యాత్మికతను చాటుకుంటున్నారు. అదేవిధంగా మట్టి విగ్రహాల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. పదేళ్ళ సొసైటీ స్థాపించిన యువకులు సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ప్రతీఏడాది వాసవీకన్యకాపరమేశ్వరి భవన్‌తో పాటు పోలీస్ స్టేషన్లలో, చందు హాస్‌మెటీరియల్ దుకాణంవద్ద అధికారుల చేతుల మీదుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏటా అడుగుఎత్తు గల మట్టి వినాయకుడి విగ్రహాలను 150 నుంచి 200 మంది భక్తులకు ఉచితంగా అందిస్తున్నారు. ఈ నెల 27న మట్టి విగ్రహాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి



వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలనే పూజించాలి. పర్యావరణాన్ని కాపాడేందుకు ఉచితంగా ఓపెన్-ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్నాం. అనేక ఏళ్లుగా స్నేహితుల సహకారంతో మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి భక్తులకు అందిస్తున్నాం. రానున్న వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను భక్తులు ఉచితంగా అందజేస్తాం. 170 మంది పూర్వ విద్యార్థులం కలిసి స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం.

సులువ శ్రీనివాస్, ఓపెన్-ఐస్ సొసైటీ అధ్యక్షుడు హుజూర్‌నగర్

వరి నాటకముందే కలుపు నివారించుకోవాలి



చిలుకూరులో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిలుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వరి నాటక ముందే రైతులు రెండుసార్లు దుక్కి దున్నుకుని కలుపుజాతి మొక్కలను నివారించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ అన్నారు. గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శనివారం చిలుకూరు, దూదియాతండా, జానకీనగర్ గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పొలాల్లో గతానికి భిన్నంగా పచ్చ కలుపు మొక్కలు పుట్టకొస్తున్నాయని తెలిపారు. వాటిని నివారించేందుకు రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. వరి పొలాల్లో కలుపు మందు పిచికారీ చేసే సమయంలో కొద్దిగా నీరు ఉంచాలని సూచించారు. కలుపు జాతి మొక్కలకు 20 రోజుల లోపు కలుపు నివారణ మందు పిచికారీ చేయాలని అన్నారు. రైతులు రసాయనిక ఎరువులు రచించి సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయటం ద్వారా దిగుబడిలో అధిక లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఆమె వెంట శాస్త్రవేత్తలు అంజయ్య, డాక్టర్ కిరణ్, ఏవో శ్రీధర్, ఏఈవోలు శిరీష, త్రివేణి, రైతులు బట్టు శివాజీ, మండవ అచ్చయ్య, బజ్జూరి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మునుగోడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివద్ధితో పాటు బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్)లో శనివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, పౌష్టికాహారం, పాఠ్య, రాత పుస్తకాలతో పాటు దుస్తులు వంటి వివిధ రకాల అన్ని వసతులు విద్యార్థులకు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచిన పాఠశాలలకు మాత్రమే తన కోటా అభివృద్ధి నిధులను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తానని వివరించారు. మునుగోడు ఎంపీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య అధికంగా పెంచటంపై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండు అదనపు తరగతి గదులను ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో, పాఠశాల హెచ్ఎం సుంకరి భిక్షంగౌడ్, పీఆర్టీయూ సంఘం నాయకులు నరింహారెడ్డి, నారాయణరెడ్డి, జైనారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కళావతి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ యూసూఫ్‌పాషా, అన్నెపురెడ్డి పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజులసూర్యావర్

శాలిగౌరారం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చట్టం ముందు అందరూ సమానమేనని, కుల, మత, ధన, పేద వివక్ష లేకుండా అందరికీ సమాన న్యాయం చేస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ కుమారి మంజులసూర్యావర్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాలలో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల చట్టాల గురించి వివరించారు. వయోవృద్ధులైన తల్లీ దండ్రులను చివరి వరకు చూసుకునే బాధ్యత వారి పిల్లల మీద ఉందన్నారు. వారిని చక్కగా చూసుకుంటూ ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా చూడాలన్నారు. ఒక వేళ సరిగా పోషించని పక్షంలో లీగల్ సర్వీస్ ద్వారా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి మాట్లాడుతూ వయో వృద్ధులకు తన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఎంఈవో మందుల సైదులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సీనియర్ అడ్వకేట్ బచ్చుపల్లి ప్రకాష్‌రావు, గ్రామ మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు వై.కృష్ణారెడ్డి, న్యాయవాదులు నోముల గోవిందరాజులు, కొండ యాదగిరి, జి.ఓంకార్, ఏజీపీ నాగరాజు, వలంటీర్లు వైద్యుల ఉపేందర్, వెంకటేశ్వర్లు, జయరాం గ్రామ వయోవృద్ధులు పాల్గొన్నారు.

సెర్ప్ ద్వారా ఇక కొత్త సంఘాలు

● వృద్ధులు, కిషోర బాలికలు, దివ్యాంగులు వేర్వేరు కేటగిరీలతో సంఘాల ఏర్పాటు

● అర్హత ఉన్న వారిని గుర్తించే పనిలో సెర్ప్ సిబ్బంది

● నెలాఖరులోగా సంఘాల ఏర్పాటు

నార్కట్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా ఇక కొత్త సంఘాలు రానున్నాయి. ఇంతకాలం కేవలం మహిళలతోనే స్వయం సహాయక సంఘాలు ఏర్పడగా తాజాగా వృద్ధులు, కిశోర బాలికలు, దివ్యాంగులు (స్త్రీలు, పురుషులు) సెర్ప్ ద్వారా కొత్త సంఘాలుగా ఏర్పాటు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని సంఘాల్లో చేర్పించడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే కొత్త సంఘాల ఏర్పాటుకు సెర్ప్ వినూత్నంగా శ్రీకారం చుట్టింది. ఈ సంఘాల ఏర్పాటును కేవలం ఆర్థిక కోణంలోనే కాకుండా సామాజిక కోణంలో ఆలోచించిన ప్రభుత్వం వృద్ధులను, కిశోర బాలికలను, దివ్యాంగులను కూడా సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి సామాజిక ఆసరాగా నిలవాలని భావిస్తుంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు కొత్తగా ఏర్పడే సంఘాల ఏర్పాటుకు సదరు కేటగిరీకు చెందిన వారిని గుర్తించే పనిలో మండల స్థాయిలో సెర్ప్ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఈనెలాఖరులోగా వారిని గుర్తించి సంఘంగా ఏర్పడటంతో పాటు ఖాతాలను తెరిచేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటికే అవగాహన కల్పించాం



కొత్త సంఘాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందికి అవగాహన కల్పించాం. ఇప్పటికీ సంఘాల్లో చేరని సభ్యులను గుర్తించి వారిని కొత్త సంఘ సభ్యులుగా చేర్పించే పనిలో ఏపీఎంలు, సీసీలు ఉన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులు, కిశోరబాలికలను గుర్తించి వారిని సంఘాలుగా ఏర్పాటు చేసి ఖాతాలు తెరిపించి వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని ఆదేశాలిచ్చాం. జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీవో సిబ్బంది నిమగ్నమయ్యారు. అవసరమైతే వైద్యారోగ్య శాఖ, దివ్యాంగుల సంక్షేమశాఖ సహకారాన్ని తీసుకోవాలని సూచించాం.

- శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నల్లగొండ



ఇదీ ప్రభుత్వ ఉద్దేశం

మహిళలు పొదుపు సంఘాలుగా ఏర్పడిన విషయం పాఠకులకు విదితమే. సంఘాల్లో ఉన్న ఎంతో మంది మహిళలు పొదుపు డబ్బుల రుణం ద్వారా కుటీర ఉపాధి వనరులను, చిన్న చిన్న వ్యాపారాలను ఏర్పాటు చేసుకుంటూ కుటుంబ ఆర్థిక స్వావలంబనలో మహిళల పాత్రను మరింత ఇనుమడింపజేస్తున్నారు. అయితే ఇదే సందర్భంలో వయస్సు మీరి ఇంటికే పరిమితమై తాము ఒంటరిగా ఉన్నామనే ధ్యాసతో వృద్ధులు మానసిక వ్యధకు గురికాకుండా సంఘంగా ఏర్పడటం ద్వారా వారిలో నవచైతన్యాన్ని తన కోసం నలుగురు ఉన్నారనే మానసిక స్థైర్యాన్ని పొందే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావించింది. వీరిని కూడా సంఘాలుగా ఏర్పడేలా వినూత్న ఆలోచన చేసింది. అదేవిధంగా కిషోర బాలికలను కూడా సంఘాలుగా చేర్చి వారిలో సమాజంపై మంచి చెడ్డలను తెలుసుకునే అవకాశాలను కల్పించింది. ప్రభుత్వం కూడా వీరికి తరుచూ వీరికి అవగాహన సదస్సులు నిర్వహించి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవాటు చేయాలని సంకల్పించింది. ఇకపోతే దివ్యాంగుల్లో కూడా తాము ఎవరికీ తీసిపోమనే విధంగా వారిని కూడా ప్రత్యేక సంఘాలుగా గుర్తించడం ద్వారా అండగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది.

సంఘాల ఏర్పాటు ఇలా..

60సంవత్సరాలు ఆపై వయస్సు ఉన్న మహిళలందరూ వృద్ధుల సంఘాల్లో చేరవచ్చు. అయితే ప్రస్తుతం ఏదైనా మహిళా సంఘాల్లో కొనసాగుతున్న వారెవరైనా ఉంటే వారు వృద్ధుల సంఘాల్లో చేరనవసరం లేదు. అదేవిధంగా కిషోర బాలికల్లో మాత్రం రెండు గ్రూపులుగా సంఘాలను ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. 11 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసున్న వారిని ఒక గ్రూపుగా 14 ఆపై సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలను మరో గ్రూపుగా సంఘంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ సంఘాల్లో సభ్యులుగా కనీసం 10 మంది ఉండాల్సి ఉంది. కానీ దివ్యాంగుల సంఘాల ఏర్పాటుకు సభ్యుల సంఖ్యలో మినహాయింపు ఉంది. 5 నుంచి పది మందిలోపు ఉండే అవకాశాన్ని కల్పించారు. అయితే దివ్యాంగుల సంఘాల్లో స్త్రీలతో పాటు పురుషులు కలిసి ఓ సంఘంగా ఏర్పడే వెసులుబాటు ఉంది. వయస్సు నిర్ధారణకు వృద్ధులకు మాత్రం ఓటరు గుర్తింపు కార్డును ప్రామాణికం చేశారు.

పొదుపు మొత్తంపై షరతులు లేవు

సంఘాలుగా ఏర్పడే వారు ఇంత మొత్తంలో పొదుపు చేయాలనే షరతు ఏమీ లేదు. సంఘంలో చేరిన సభ్యుల ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి నెలానెలా ఎంత పొదుపు చేసుకోవాలనేది వారే నిర్ణయించుకుంటారు. ప్రస్తుతం ఉన్న మహిళా పొదుపు సంఘాల మాదిరిగానే ఈ సంఘాలు కూడా నెలానెలా సమావేశాలు నిర్వహించి పొదుపు డబ్బులు కట్టడం, బ్యాంకుల ద్వారా లోను తీసుకోవడం, మ్యాచింగ్ గ్రాంటులు పొందడం, రికార్డుల నిర్వహణ వంటివి చేసుకోవచ్చు. వీఏవోలు, సంఘబంధాలు వీరికి సహకరించనున్నాయి.

నిద్రాహారాలు మాని..

● ఉమ్మడి జిల్లాలో యూరియా కోసం అన్నదాతల తిప్పలు ● పోలీసుల పహారాలో పంపిణీ



నల్లగొండ జిల్లా కనగల్ పీఏసీఎస్ వద్ద భారీ సంఖ్యలో వచ్చిన రైతులు

నిడమనూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యూరియా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. ఒక్క బస్తా కోసం పరుగులు పెడుతున్నారు. నిద్రాహారాలు సైతం మాని రాత్రి నుంచే సొసైటీ ఎదుట కాపలా కాస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వృద్ధులు, మహిళలు సైతం క్యూలో నిల్చుంటున్నారు. పోలీసుల పహారాలో యూరియా అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. నల్లగొండ జిల్లా నిడమనూరు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట టోకెన్ల కోసం రైతులు గంటలకొద్దీ ఎదురు చూస్తున్నారు. కనీసం ఒక్క బస్తా అయినా ఇవ్వండి సారూ అంటూ అధికారులను వేడుకుంటున్నారు. యూరియా కోసం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు శనివారం పెద్ద ఎత్తున సింగిల్ విండో కార్యాలయం ఎదుట బారులు తీరారు. రెండు వారాల తర్వాత సొసైటీకి ఒక్క లోడు(444 బస్తాలు) యూరియా వచ్చింది. రైతులు భారీగా క్యూలో ఉండటంతో వచ్చిన ఒక్క లోడు యూరియా ఏమూలకు సరిపోదు. దీంతో రైతులకు రెండు బస్తాల చొప్పున ఇచ్చేందుకు టోకెన్లు ఇచ్చారు. రైతులను అదుపు చేసేందుకు పోలీసుల పహారాలో యూరియాను విక్రయిస్తున్నారు.

యూరియా అందక వెనుదిరిగిన రైతులు

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద శనివారం ఉదయం నుంచి యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో రైతులు క్యూ కట్టారు. సుమారు ఐదు రోజుల నుంచి యూరియా రాకపోవడంతో పడికాపులు కాస్తున్న రైతులు యూరియా దొరకడం లేదని వాపోయారు. పీఏసీఎస్‌కు శనివారం యూరియా లారీ రావడంతో దాదాపు 446 బస్తాలు రావడంతో పోలీసుల సహకారంతో మండల వ్యవసాయ అధికారి జానకిరాములు సీరియల్ ప్రకారం రశీదులు రాశి ఒక్కో పాస్ బుక్కుపై రెండు యూరియా బస్తాల చొప్పున ఇచ్చారు. యూరియా దొరక్క కొంత మంది రైతులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

గంటల తరబడి క్యూలైన్‌లో..

పెద్దఅడిశర్లపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం శనివారం ఉదయం నుంచి రైతులు యూరియా కోసం బారులు తీరారు. గంటల తరబడి లైన్‌లో నిలబడి యూరియా కోసం ఎదురు చూశారు. పీఏపల్లి మండలకేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు సహకార సంఘానికి ఒక్క లారీ లోడు యూరియా వస్తుందని సమాచారం తెలియడంతో పెద్దసంఖ్యలో రైతులు సహకార సంఘం గోదాం వద్దకు చేరుకున్నారు. మూడు నాలుగు గంటలు వరుసలో క్యూకడితే రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీస్ పహారాలో..

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే సహకార సంఘం ఎదుట రైతులు యూరియా కోసం తరలి వచ్చారు. దీంతో రైతుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. యూరియా కోసం వచ్చిన



నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

రైతులు తోసుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. 222 బస్తాల యూరియా మాత్రమే రావడంతో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులు క్యూలో నిల్చున్నా యూరియా అందకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పోలీస్ పహారాలో క్యూపద్ధతిలో ఏర్పాటుచేసి ఉన్న యూరియాను పంపిణీ చేసేందుకు సహకరించారు. మండల పరిధిలోని బూరుగడ్డ, అమరవరం, లింగగిరి, వేపలసింగారం గ్రామాల్లో రైతులు యూరియా కోసం బారులు తీరారు.

తుర్కపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. వృద్ధులు లైన్లో నిల్చుని అలిసిపోయారు. యూరియా కోసం తెల్లవారు నుంచే వివిధ గ్రామాల నుంచి రైతులు పీఏసీఎస్ కేంద్రానికి చేరుకొని కార్యాలయం ఎప్పుడు తీస్తారోనని పడిగాపులు కాస్తున్నారు. శనివారం 244 సంచుల యూరియా వస్తుందని అధికారులు తెలిపారు సగం లోడ్ 122 సంచు మాత్రమే వచ్చింది. సగంలోడ్ ఆదివారం వస్తుందని పీఏసీఎస్ కార్యదర్శి రమేశ్ తెలిపారు.

ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ

కనగల్ : నల్లగొండ జిల్లా కనగల్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ కేంద్రంలో 220 బస్తాల యూరియా అందుబాటులో ఉండగా 110 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. కాగా పీఏసీఎస్ వద్ద ఎలాంటి తోపులాటలు లేకుండా ఏవో అమరేందర్‌గౌడ్, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, సీఈవో రాంచంద్రారెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన



మహామంటపంలో ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన ఉత్సవం

నార్కట్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై శనివారం లక్ష పుష్పార్చన మహోత్సవం ఘనంగా జరిగింది. అమావాస్య తిథి సందర్భంగా నిర్వహించే ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత గర్భాలయం నుంచి పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల మధ్య మహా మంటపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతుల పాటి రామలింగేశ్వరశర్మ, ఉప ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ సహార్చకులు సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య విశేష పుష్పాలతో ఉత్సవమూర్తులను ఘనంగా అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామివారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరునితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పాదరక్ష, కోడె మొక్కులను తీర్చుకున్నారు. ఈ వేడుకలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

నకిరేకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా అరికట్టి రైతులకు సరిపడా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అంబటి చిరంజీవి డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో శనివారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరా సరిపడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి 10లక్షల 50వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం 9.50లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడంతో రైతులకు యూరియా సరిపోవడం లేదని పేర్కొన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుల కూలీ సంఘం నాయకులు మామిడోజు వెంకటేశ్వర్లు, బండారు వెంకన్న, పిట్టల అనిల్, దాసరి నర్సింహ, పవన్, సురేష్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాతో సురవరానికి విడదీయలేని అనుబంధం

దేవరకొండ, చిట్యాలరూరల్, మోత్కూరు, చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఎంపీగా పనిచేసిన సమయంలో జిల్లాలో నెలకొన్న ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. పార్లమెంట్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన సురవరం జిల్లా అభ్యున్నతికి కృషి చేశారు.

సుధాకర్‌రెడ్డికి దేవరకొండ నియోజకవర్గానికి మంచి అనుబంధం ఉంది. సీపీఐ ఉద్యమ నిర్మాతలైన పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావు, రామశర్మ, పల్లా వెంకట్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డిలతో ఆయన సన్నిహితంగా ఉండేవారు. నియోజకవర్గం అప్పట్లో కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా ఉండటంతో దేవరకొండ నియోజకవర్గంలో జరిగే ఉద్యమాలు, పోరాటాలు, సభల్లో ఆయన పాల్గొనే వారు. శ్రీశైలం సొరంగమార్గం పూర్తి చేయాలని 2012లో నక్కలగండి నుంచి హైదరాబాద్ అసెంబ్లీ వరకు నిర్వహించిన సీపీఐ పాదయాత్రలో పల్లా వెంకట్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డి, రవీంద్రకుమార్, ఉజ్జిని యాదగిరిరావు, భూపాల్‌తోపాటు కలిసి పాదయాత్ర చేశారు. 2002లో కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి డిండికి నీరు అందించాలని డిండి నుంచి నల్లగొండకు పాదయాత్ర నిర్వహించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. పార్లమెంట్ సభ్యునిగా రెండు పర్యాయాలు గెలుపొంది దేవరకొండ నియోజకవర్గానికి ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారు. దేవరకొండ మండల పరిషత్ కార్యాలయ భవనానికి రూ.10లక్షలు, మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల లైబ్రరీకి రూ. 10లక్షలు, దేవరకొండలోని రోడ్లకు ఎంపీ నిధుల నుంచి రూ.20లక్షల వరకు మంజూరుచేశారు. ఎంపీగా, సీపీఐ జాతీయ



దేవరకొండలో సీపీఐ జాతీయ కార్యదర్శి ఎంబీ. బర్ధన్‌తో కలిసి బహిరంగ సభలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి (ఫైల్)

కార్యదర్శిగా వివిధ హోదాలలో దేవరకొండలో జరిగే సీపీఐ సమావేశాలకు హాజరయ్యారు. ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించే సురవరం మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సులోచన నాయకులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దేవరకొండలో జరిగిన ఎన్నికల ప్రచారంలో అప్పటి సీపీఐ జాతీయ కార్యదర్శి ఎంబీ. బర్ధన్‌తో కలిసి జరిగిన బహిరంగ సభకు ఆయన హాజరై మాట్లాడారు.

గుండ్రాంపల్లిలో అమరుల స్మారక స్తూపం ఆవిష్కరణ

మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి చిట్యాల మండలానికి అనుబంధం ఉంది. ఆయన ఎంపీగా రైతాంగ సాయుధ పోరాటంలో మండలంలోని గుండ్రాంపల్లిలో రజాకార్ల దాష్టీకానికి బలైన అమరవీరులకు ఆయన నివాళులర్పించేవారు. అమరవీరులకు గుర్తుగా ఏర్పాటు చేసిన స్మారక స్తూపాన్ని సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అప్పటి నుంచి కొన్నేళ్ల వరకు సెప్టెంబరు 17న సాయుధ రైతాంగ పోరాట వీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరై అమరవీరుల స్మారక స్తూపం వద్ద సురవరం సుధాకర్‌రెడ్డి నాయకులతో కలిసి నివాళులర్పించారు.

● సీపీఐ జాతీయ నాయకుడు, దివంగత నేత సురవరం సుధాకర్ రెడ్డికి యాదాద్రిభువనగిరి జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్నప్పుడు, ఆ తర్వాత కూడా మోత్కూరు ప్రాంత పార్టీ నిర్మాణంలో ఆయన పాలుపంచుకున్నారు. సీపీఐ మోత్కూరు ప్రాంత నాయకులు పలువురితో ఆయనకు నేరుగా పరిచయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో నిర్వహించిన ప్రజా పోరాటాలు, బహిరంగ సభల్లో ఆయన చాలా సార్లు పాల్గొని ప్రసంగించారు. మునుగోడు భూపోరాటంలో ఆయన పాల్గొన్నారు. 1999లో టీడీపీ మద్దతుతో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి సురవరం సుధాకర్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారంలో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి పాల్గొని ప్రసంగించారు.



చిట్యాల: గుండ్రాంపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి (ఫైల్)

విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా శక్తి పెంపొందించుకోవాలి

నకిరేకల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అంతరిక్ష పరిశోధనా శక్తి పెంపొందించుకోవాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. కళాశాలలో శనివారం ఫిజిక్స్ విభాగంలో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత్ అంతరిక్ష పరిశోధన రంగంలో ముందుకు దూసుకుపోయే విధంగా విద్యార్థులు పరిశోధనశక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంత స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి కూరగాయల సంత స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ స్థలంలో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని అన్నారు. విచారణ వాటిని అక్రమ నిర్మాణాలను తొలగించి ఆ స్థలాన్ని గ్రామానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మునుకుంట్ల గణేష్, నాగరాజు, రామలింగం పాల్గొన్నారు.

అతిథిగృహాన్ని పట్టించుకునేవారేరీ?

శిథిలావస్థలో మూసీ అతిథిగృహం ▸▸ పట్టించుకోని అధికారులు



మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరిన మూసీ ప్రాజెక్టు అతిథిగృహం

కేతేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహం శిథిలావస్థకు చేరింది. మూసీ ప్రాజెక్టు నిర్మించిన తొలినాళ్లలో ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో ముందుకుసాగింది. దీంతో నాడు ఈ ప్రాజెక్టు వద్ద ఓ అందమైన అతిథిగృహాన్ని నిర్మించింది. రెండు గుట్టల మధ్య నిర్మితమై అందంగా చూపరులను ఆకర్షించే ఈ ప్రాజెక్టు వద్ద నిర్మితమైన అతిథి గృహ పరిసరాల్లోని పార్కులు, పూతోటలు, ఫౌంటేన్‌లు ఆకర్షణీయంగా ఉండేవి. ఈ అతిథి గృహం ఆవరణలోనే సిబ్బందికి క్వార్టర్లు, పూల మొక్కలు, ఫౌంటేన్‌లను సైతం ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమంలో నిధుల కొరత, నిర్వహణ లోపంతో మూసీ పరిసరాలు అందాలను కోల్పోయాయి. ఈ క్రమంలో పదేళ్ల క్రితం ప్రాజెక్టు గేట్లు, ట్యాంకు మరమ్మతులు చేపట్టినా అతిథి గృహం వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. ప్రాజెక్టు గేట్ల పనులన్నీ ఈ అతిథిగృహం ఆవరణలోనే నెలల తరబడి నిర్వహించారు. గేట్ల తయారీ సిబ్బందికి దాదాపు ఏడాది పాటు ఈ అతిథి గృహం ఆవరణలోనే వసతి ఏర్పాట్లు చేశారు. అయినా ఈ అతిథిగృహాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు ఈ అతిథి గృహం చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో ఇందులో పశువులు, గొర్రెలు, మేకలు తిరుగుతుంటాయి.

ప్రహరీ లేకపోవడంతో అతిథిగృహం ఆవరణ నలువైపులా ఆక్రమణలకు గురవుతుందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. దాదాపు రెండు దశాబ్దకాలకు పైగా మరమ్మతులు లేకపోవడంతో ఈ అతిథిగృహం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరద నీటితో పొంగిపొర్లుతున్న మూసీ ప్రాజెక్టు వద్దకు పర్యాటకుల రాకడ భారీగానే ఉంటుంది. ప్రాజెక్టు వద్దకు సందర్శకులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నా అతిథిగృహానికి వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా మారడంతో కనీసం పర్యాటకులు అతిథిగృహం ఆవరణలోని చెట్లకిందకు వెళ్లి సేదతీరే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు అతిథి గృహం మరమ్మతులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.60లక్షలతో ప్రతిపాదనలు అందించాం



మూసీ ప్రాజెక్టు అతిథిగృహం మరమ్మతులకు రూ.60లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించాం. గెస్టుహౌజ్ మరమ్మతులకు ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేసే వీలుంది. ప్రతిపాదనలకు అనుమతులు రాగానే పనులు చేపడతాం. అతిథిగృహం చుట్టూ ఆక్రమణలు లేకుండా ఉండేందుకు సర్వే చేయించి ప్రహరీ గోడ సైతం నిర్మిస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, మూసీ డీఈ

ఎన్ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కింద ప్రభుత్వ ఆర్థిక సాయం పొందేందుకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు సూచించారు. గత ఏడాది జనవరి 1 నుంచి ఈ ఏడాది ఆగస్టు 23 వరకు 18-59 ఏళ్ల వయసు గల వారు ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి ఎన్ఎఫ్‌బీఎస్ కింద రూ.20వేలు ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ పథకానికి అర్హులను గుర్తించేందుకు ఈ నెల 25న రెవెన్యూ యంత్రాంగం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూరించి సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందించాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టడంలో విఫలం

నార్కట్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. ఆ రోగ్యం బాగాలేక ఆసుపత్రులకు వెళితే మందులు లేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజ ల ప్రాణాలతో చెలగాటమాడకుండా ప్రభుత్వం పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యానాల అశోక్‌రెడ్డి, చి రుమర్తి యాదయ్య, కొండూరు శంకరయ్య, దుబ్బాక శ్రీధర్, కర్నాటి ఉపేందర్, సై దులు, విష్ణుమూర్తి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ పూర్తి

● పలు గ్రామాల ఉపాధి హామీ సిబ్బందికి మెమోలు జారీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు

తిప్పర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో భాగంగా కొన్ని రోజులుగా గ్రామాల స్థాయిలో పూర్తి చేసుకున్న తనిఖీ శనివారం తిప్పర్తి మండ లకేంద్రంలో మండల స్థాయి తనిఖీ నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా తిప్పర్తి మండలంలో 14వ విడత నిధుల్లో 4 కోట్ల 71లక్షల 2వేల 419 వ్యయంతో పనులు పూర్తయినట్లు తెలిపారు. ఎంచాయతీరాజ్‌లో మరో 4 కోట్ల 85లక్షల 62 వేల పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కాగా మండల పరిధిలోని రాజుపేట, రామలింగాలగూడెం, పజ్జూరు, కంకణాలపల్లి గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. అందుకు గాను ఆయా గ్రామాల ఉపాధిహామీ సిబ్బందికి మెమోలు జారీ చేశారు. రామలింగాలగూడెంలో 46 వేలకు పైగా లెక్కలు చూపించకపోవడంతో మరోసారి ప్రత్యేక విచారణ చేయాలని ఏపీడీ నవీన్‌కుమార్‌కు సూచించినట్లు జిల్లా విజిలెన్స్ అధికారి సీహెచ్ వేణుగోపాల్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి. గౌరి, ఎస్ఆర్‌పీ రంజిత్, ఎంపీడీవో సుధాకర్, ఏపీవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

గాంధీ గ్లోబల్ కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం


● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా అక్టోబరులో నిర్వహించే కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో విప్ బీర్ల ఐలయ్య, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌తో కలిసి శనివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో యాదగిరిగుట్టలో 500 విగ్రహాలను 150 ప్రదర్శనలు, రైతుల అవార్డులు, స్వదేశీ ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, గాందారి ప్రభాకర్, పడమటి పావని, ఎస్ఎన్ రెడ్డి, హరిదీప్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్‌గౌడ్, నాగమణి పాల్గొన్నారు. అనంతరం మంత్రికి గాంధీ విగ్రహంతో పాటు మట్టి వినాయక విగ్రహంతో శాలువాతో సత్కరించారు.

మెకానికల్ ఇంజనీరింగ్‌లో నరేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నరేష్

నల్లగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 17వ వార్డులోని అర్జాలబావికి చెందిన ఆదెపు నరేష్‌కు వరంగల్‌లోని ప్రతిష్ఠాత్మకమైన జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి శనివారం డాక్టరేట్‌ను అందించారు. మైల్డ్ స్టీల్ సబ్‌స్ట్రేట్, ఫ్రిక్షన్ స్టిర్ సర్ఫేసింగ్ పనితీరు అంచనాపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విద్యాధర్ సబూది, ప్రొఫెసర్ రవికుమార్, ప్రొఫెసర్ వంశీకృష్ణ, గంగాధరుడు, అలోక్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలను నిర్వహించాలి

మర్రిగూడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని అన్నారు. అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల బీసీలు రిజర్వేషన్ పొందలేకపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు అమలుచేయడంలో నిర్లక్ష్యం తగదని, వెంటనే పార్లమెంటులో అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఉప్పల యాదయ్య, అంజయ్య, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారంలో దుకాణాల బంద్

శాలిగౌరారం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలో మార్వాడీ గో బ్యాక్ అనే నినాదంతో శనివారం స్థానిక వర్తక వ్యాపారస్థులు బంద్ పాటించారు. ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులను పోలీసులు అడ్డుకున్నారు. నకిలీ వస్తువులు తక్కువ ధరకు విక్రయిస్తూ మార్కెట్‌ను నాశనం చేస్తున్న మార్వాడీలు వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ షాపుల యజమానులు గుండు శంకర్, బొడ్డు నగేష్, కాగితాల నాగరాజు, మిర్యాల సాయి, వేముల భరత్, కప్పల అశోక్, బొల్లికొండ గణేష్, రంగు వీరయ్య, నితిన్, వెంకట్‌రెడ్డి, బాలరాజు, సందీప్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సదుపాయాల కోసం నిధులు కేటాయించాలి

గట్టుప్పల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో సీపీఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ మార్కండేయ కాలనీలో సీసీ రోడ్లు, మురికికాల్వలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తేరట్‌పల్లి నుండి షేరిగూడెం, వెల్మకన్నె ఈ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలని, చండూరు ప్రధాన రహదారి రోడ్డు నుంచి స్కూల్ వరకు మురికి కాల్వ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అచ్చిన శ్రీనివాసులు, పగిళ్ల శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, కట్ట యాదగిరి, వల్లూరి జంగయ్య, అచ్చిన బీరప్ప, పబ్బు లింగస్వామి, మల్లయ్య, బిక్షం, సక్కుబాయి, సువర్ణ, కొండమ్మ, రవీంద్రచారి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

శంకర్, ఎస్ఐ, తిప్పర్తి



యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ వి.శంకర్ అన్నారు. ముఖ్యంగా వినాయక చవితి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు.

(తిప్పర్తి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వినాయక చవితి ఉత్సవాల్లో పోలీస్ పాత్ర ఏమిటి?

ఎస్ఐ: వినాయక చవితి ఉత్సవాలకు డీజే అనుమతి లేదు. అదే విధంగా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు పోలీస్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: స్మార్ట్ పోలీసింగ్ లాం టివి ఏమైనా చేపట్టారా ?

ఎస్ఐ: స్మార్ట్ పోలీసింగ్‌లో యువత పాత్ర ఉంటుంది. గ్రామాల్లో చదువుకున్న యూత్ సపోర్టింగ్ మాకు ఉంటుంది. ప్రతీ వినాయక మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. దీని వల్ల ఎక్కడ ఇబ్బందులు రాకుండా ఉంటుందని భావిస్తున్నాం. ప్రధానంగా మండపాలకు ఉపయోగించే విద్యుత్ కూడా పంచాయతీ సెక్రటరీ అనుమతితోనే ఏర్పాటు చేసుకోవాలని సూచించాం.

ఆంధ్రజ్యోతి: మీరు ఇచ్చే ముఖ్యమైన సూచనలు?

ఎస్ఐ: వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా నిర్వహించుకోవాలి. రాత్రి సమయంలో నిమజ్జనానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేవు. నిమజ్జనాల సమయంలో చిన్నారులను వెంట తీసుకెళ్లకూడదు. వినాయక ఉత్సవ నిర్వాహకులు, యూత్‌తో కలిసి ప్రశాంతంగా ఉత్సవాలను ముగించేలా చేస్తాం.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొరివి కృష్ణ



మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీచర్లు

నల్లగొండటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగుల వృద్ధాప్య జీవితానికి భద్రత కల్పించాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొరివి కృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిటశాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి కోరుతూ టీజీసీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేపట్టిన ఆత్మగౌరవసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో పర్యటించి సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో ఉద్యోగులు భాగమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేతేపల్లి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రస్తుతం అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు, ఫ్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భీమారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.భిక్షమయ్య, ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బి.జానకిరెడ్డి, జి.రమేష్, జి.వెంకటేశ్వర్లు, కన్నె శివయ్య, ఎల్.శ్రీధర్, ఎం.శేఖర్, డి. నాగయ్య, నరేందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘనంగా నివాళులు



నల్లగొండలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, చిట్యాలరూరల్, గట్టుప్పల్, మర్రిగూడ, చిట్యాల, మునుగోడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తు చేశారు. సుధాకర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి మనోధైర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తీవ్రంగా కృషి చేసి చరిత్రలో నిలిచారన్నారు. ఏఐసీబీ జాతీయ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ఎంపీగా నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం కలిగిన సురవరం చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేశారన్నారు.

● చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొడిగె సైదులు, జిల్లా సత్యం, కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, నమ్ముల విజయ్‌కుమార్, గోపగోని నర్సింహ, జిల్లా లక్ష్మయ్య, బొడిగె బక్కశెట్టి, యాదయ్య, శంకర్‌రెడ్డి, సైదులు, శేఖర్ పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వేమనపల్లి రమేష్, నాయకులు కారింగ్ శ్రీను, ఐత రాజు లక్ష్మయ్య, చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు ధనంజయ, కట్ట రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని మర్రిగూడ, ఖుదాబక్ష్‌పల్లి గ్రామాల్లో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, బిక్షంరెడ్డి, అంజయ్య, మహేందర్, అశోక్ యాదయ్య, ఈదయ్య, రామచంద్రం లక్ష్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, నాయకులు దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, అంజయ్య, కూనూరు మారయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులోని బీఆర్అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, మండల కార్యదర్శి చాపల శ్రీను, రాజకీయ జేఏసీ చైర్మన్ టీ. నర్సింహాచారి, ఏఐవైఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు టీ. వెంకటేశ్వర్లు, బొల్గూరి నర్సింహ, చలపతి, లింగయ్య, బాలమణి, యాదన్న, వెంకన్న, కైలాసం పాల్గొన్నారు.

అట్టహాసంగా ఈషా గ్రామోత్సవాలు

నల్లగొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో శనివారం 17వ ఈషా గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు 15 పురుషుల వాలీబాల్ జట్లు, 10 త్రో బాల్ మహిళల జట్లు పాల్గొని పోటీపడ్డాయి. జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ ముఖ్యఅతిథి హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన ఈ ఉత్సవాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తితో ఆటలాడారు. దీంతో మైదానం అంతా క్రీడాకారులతో సందడి చేసింది. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా సంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కుమారి గాయత్రి పేరిణి నాట్యం అందరినీ ఆకట్టుకుంది. 2024లో సద్గురు ప్రారంభించిన ఈషా గ్రామోత్సవం, గ్రామీణ భారత స్ఫూర్తిని పునర్జీవింప చేయడానికి ఈ ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

సెప్టెంబరు 21వ తేదీ వరకు క్లస్టర్, డివిజన్ జిల్లా స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అక్బర్ అలీ, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ కె.సతీష్, క్యాబినెట్ సెక్రటరీ రామకృష్ణ, హెచ్‌జీఎఫ్ కార్యదర్శి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాస్, వెంకట్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో జాప్యం!

(5వపేజీ తరువాయి)

సేకరించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, వాటిల్లో దాదాపు పూర్తి సామర్థ్యం మేర నిల్వలు పేరుకుపోయాయి. వీటిలో కనీసం ఇప్పుడు యాసంగి సీఎంఆర్‌కు సంబంధించిన బియ్యం ఇంకా మిల్లుల వద్దే నిల్వ ఉంది. సుమారు 2,15,662 మెట్రిక్‌టన్నుల బియ్యం వరకైనా నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను అందుబాటులోకి తేవాలని, ఆ మేరకైనా ఎఫ్‌సీఐ కోటా బియ్యం తీసుకెళ్లేలా ఒత్తిడి చేయాలని అధికారులను మిల్లర్లు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎఫ్‌సీఐకి లేఖలు రాశామని, అదేవిధంగా రాష్ట్ర సివిల్‌సప్లయిస్‌శాఖ ఉన్నతాధికారులకు సైతం పూర్తి వివరాలతో నివేదించామని, ఈ వారంలో ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎఫ్‌సీఐ బియ్యం తరలించకపోతే కనీసం ప్రైవేట్ గోదాములనైనా అద్దెకు తీసుకొని బియ్యం తీసుకెళ్లాలని మిల్లర్లు కోరుతున్న పరిస్థితి నెలకొంది.

సీఎంఆర్ సేకరణపై దృష్టి సారించాం

జిల్లాలో వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ 91శాతం సేకరించాం. మిగిలిన 9శాతం బియ్యాన్ని వచ్చే నెల 12లోగా పూర్తిచేస్తాం. యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌పై కూడా దృష్టి సారించాం. ఎఫ్‌సీఐ కోటాకు సంబంధించిన బియ్యం తీసుకెళ్తే గోదాముల సమస్య తీరుతుంది. అందుకోసం ఎఫ్‌సీఐని సంప్రదించడంతో పాటు, ఉన్నతాధికారులకు విషయం తెలియజేశాం.

త్వరలోనే గోదాముల సమస్య పరిష్కరించి, యాసంగి సీఎంఆర్ కూడా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేష్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

కనగల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని చండూరు సీఐ ఆదిరెడ్డి అన్నారు. శనివారం కనగల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు కోసం ఉత్సవ కమిటీ సభ్యులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, ఏఈ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్రిగూడ: వినాయక చవితి మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి సీఐ దూది రాజు సూచించారు. శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో వినాయక నిర్వాహకులకు అవగాహన కల్పించారు. నాంపల్లి సర్కిల్ పరిధిలో వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ కోసం అనుమతి పొందాలన్నారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కనగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కనగల్‌లో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల మండలస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఏడాదిలో ఆశావర్కర్ల నిరవధిక సమ్మె సందర్భంగా నాటి అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆశాలకు రూ.18 వేల వేతనం, హెల్త్ ఇన్సూరెన్స్, పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం ఆశా వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కట్టంగూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తవిటి వెంకటమ్మ, మండల అధ్యక్షుడు చెవుగోని ధనలక్ష్మి, భూపతి రేణుక పాల్గొన్నారు.

ఇక జీవాలకు టీకాలు

(5వ పేజీ తరువాయి)


జీవాల నుంచి రక్త నమూనాలను చనిపోయిన జీవాల నుంచి పేగుల్లోని శోషరస కణుతులను, ఊపిరితిత్తులు, ప్లీహం వంటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిన అనంతరం జీవాలు చనిపోవడానికి కారణాలు తెలుసుకొని వ్యాధి నిర్ధారణ చేస్తారు.

వ్యాధి నివారణ, చికిత్స

పీపీఆర్ అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలను వెంటనే ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. కొత్తగా కొనుగోలు చేసిన జీవాలను కొన్ని రోజులు వేరుగా ఉంచి వ్యాధి లేదని నిర్ధారించిన తరువాతే మందలో కలపాలి. ఈ వ్యాధిని నివారించేందుకు అది సోకక ముందే పీపీఆర్ టీకాలు వేయించాలి. ఈ వ్యాధి సంవత్సరంలోపు మేకలు, గొర్రె పిల్లల్లో అధికంగా వస్తుంది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా టీకాలు వేయించాలి. టీకాలను నాలుగు నెలలు, ఆపై వయసు ఉన్న గొర్రెలు, మేకలకు ఒక మి.లీ. చొప్పున చర్మం కింద చేయించాల్సి ఉంటుంది. దీంతో పీపీఆర్ వ్యాధిని అరికట్టవచ్చు. ఈ వ్యాధికి సరైన చికిత్స లేనందున రైతులు పశువైద్యులను సంప్రదించి జీవాలకు చికిత్స అందించడం వల్ల కాపాడుకునే వీలుంటుంది. పశువైద్యుల సలహా మేరకు వ్యాధి లక్షణాలను బట్టి యాంటీబయాటిక్ మందులు, యాంటీ పైరటిక్ మందులు వాడాల్సి ఉం టుంది. నోటిపుండ్లు తగ్గడానికి బోరిక్‌యాసిడ్ కలిపిన గ్లిజరిన్‌ను పోయడంతోపా టు మేత మేయని జీవాలకు జావా, అంబలి తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

టీకాలను వేయించి జీవాలను కాపాడాలి: జీవీ.రమేష్, పశుసంవర్ధకశాఖ అధికారి

ఈనెల 26 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలను వేయిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జీవాలను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు ప్రాణాంతకమైన ఈ వ్యాధి నుంచి కాపాడటానికి టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు అందుకు సహకరించాలి. ప్రతి గొర్రెకు, మేకకు తప్పనిసరిగా టీకా వేయించాలి.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	584.50 (295.9925)	4,09,921	4,09,921
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.73 (4.13)	3,190	4,368
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	166.20 (33.18)	3,87,101	3,81,796

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

సీఎంఆర్‌లో జాప్యం!



- మిల్లుల వద్దే 53 శాతం యాసంగి బియ్యం
- గోదాములు నిండిపోవడమూ ప్రధాన సమస్య
- సీఎంఆర్ బియ్యం సేకరణ పై సీరియస్‌గా దృష్టి పెట్టామంటోన్న అధికారులు

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలో జాప్యం జరుగుతోంది. బియ్యం నిల్వ చేయడానికి గోదాములు లేకపోవడమే అందుకు ప్రధాన కారణంగా అధికారులు, మిల్లర్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న గోదాములన్నింటిలో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు బియ్యం నిల్వ ఉంది. ఎఫ్‌సీఐ కోటా బియ్యం తరలిస్తే తప్ప గోదాముల్లో సీఎంఆర్ నిల్వ చేసే అవకాశం ఉండదని తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

గోదాముల్లో చేటు లేకపోవడంతో గత వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ ద్వారా రావాల్సిన బియ్యాన్ని సేకరించడంలో పకడ్బందీగా వ్యవహరిస్తున్న అధికారులు రబీ బియ్యానికి సంబంధించి మిల్లులపై ఒత్తిడి తేలేకపోతున్నారు. ఈ సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించే నిమిత్తం ఎఫ్‌సీఐ బియ్యం తరలించాలని లేఖలు రాయడంతో పాటు, ఉన్నతాధికారులకు సైతం పరిస్థితిని వివరించామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

యాసంగి సీఎంఆర్ 53శాతం మిల్లర్ల వద్దే

జిల్లాలో సీఎంఆర్ బియ్యం వెనక్కితెప్పించడంలో జాప్యం జరుగుతోంది. గడిచిన వానాకాలానికి సంబంధించి 2,75,840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఇవ్వగా, అందుకు 1,86,158 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు 91 శాతం అంటే 1,68,866 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్‌కు చేరగా, ఇంకా 9శాతం బియ్యం అంటే 17,292 మెట్రిక్‌టన్నులు రావాల్సి ఉంది. ఈ బియ్యాన్ని సేకరించడంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించడం వల్లే పురోగతి సాధ్యమైందని చెబుతున్నారు. మొత్తం వచ్చే సెప్టెంబరు 12 నాటికి ఈ బియ్యాన్ని నిల్వ చేయాలని నిర్ణయించారు. అయితే యాసంగి సీజన్‌కు సంబంధించి మాత్రం పురోగతి లోపించింది. యాసంగిలో మిల్లులకు 6,03,305 మెట్రిక్‌టన్నుల ధాన్యం కేటాయించగా, అందుకు 4,07,731 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు 47శాతం అంటే 1,92,069 మెట్రిక్‌టన్నుల బియ్యం రాగా, ఇంకా 53శాతం బియ్యం 2,15,662 మెట్రిక్‌టన్నుల బియ్యం సీఎంఆర్ కోటా కింద రావాల్సి ఉంది. ఈ బియ్యానికి సంబంధించిన ధాన్యం మిల్లుల వద్ద పేరుకుపోయింది. మిల్లర్లు బియ్యం ఇస్తే గోదాముల్లో నిల్వచేసే పరిస్థితి లేదని, అందువల్లే అధికారులు మిల్లులపై ఒత్తిడి తేలేకపోతున్నారని చెబుతున్నారు.

ప్రైవేట్ గోదాములైనా తీసుకోవాలని డిమాండ్

జిల్లాలో నాలుగైదు సీజన్లుగా యాసంగిలోనూ దొడ్డురకాల ధాన్యం భారీగా వస్తోంది. ఆ ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్న సివిల్‌సప్లయిస్ సంస్థ సీఎంఆర్ ద్వారా బియ్యంగా మార్చి తిరిగి ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయిస్తుంది. ఎఫ్ఐసీ నుంచి ఆర్డర్లు తీసుకోవడం, తీసుకున్న ఆర్డర్ ప్రకారం బియ్యాన్ని పంపేందుకు అవసరమైన రైల్వే ర్యాకులు తెప్పించడంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ సంస్థ, కేంద్ర ఎఫ్‌సీఐ మధ్య సమన్వయలోపం ఎదురవుతోంది. దీంతో జిల్లాలో బియ్యం నిల్వలు పేరుకుపోవడంతో ప్రస్తుతం గత యాసంగికి సంబంధించిన సీఎంఆర్ కోటా బియ్యం మిల్లుల నుంచి

- మిగతా 8వ పేజీలో...

ఇక జీవాలకు టీకాలు

» 26 నుంచి సెప్టెంబరు 10వరకు టీకాలు » పశువైద్య సిబ్బందితో 54 బృందాల ఏర్పాటు

జిల్లాలో గొర్రెలు, మేకల్లో పీపీఆర్ (పారుడు) వ్యాధి నివారణకు టీకాలు వేసేందుకు పశుసంవర్ధకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 12లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. పీపీఆర్ వ్యాధి నివారణకు వ్యాధి నిరోధక టీకాలను ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు జిల్లాలోని అన్నిగ్రామాల్లో పంపిణీ చేయనున్నారు. అందుకు పశువైద్య సిబ్బందితో 54బృందాలు ఏర్పాటుచేశారు. ప్రతీ బృందంలో పశు వైద్యుడితోపాటు సిబ్బంది ఉంటారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పీపీఆర్ వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధితోవల్ల గొర్రెలు, మేకల మరణాలు సంభవించే అవకాశాలు అధికం. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందు జాగ్రత్తగా టీకాలు వేయించేందుకు నిర్ణయించింది. ఈ టీకాలతో జీవాలను వ్యాధి నుంచి కాపాడవచ్చు. పీపీఆర్ అనేది వైరల్ డయోరియా వంటిది. ఈ టీకాలపై జీవాల పెంపకందారులకు పశు వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.



వ్యాధి వ్యాప్తి చెందుతుందిలా..

గొర్రెలు, మేకల్లో పారుడు రోగం అంటు వ్యాధిలా సోకుతుంది. జీవాలకు సరైన గాలి, వెలుతురు అందకపోవడం, కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడంతోపాటు వర్షాల కారణంగా వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధిగ్రస్థ జీవాలను కొనుగోలు చేసి మందలో కలపడం వల్ల ఇతర జీవాలకు ఇది సోకుతుంది. అదేవిధంగా వ్యాధిగ్రస్థ జీవాలు విసర్జించే పేడ, స్రావాల వల్ల ఇతర జీవాలకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో అధిక జ్వరం రావడం, కళ్ల, ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పొక్కులు ఏర్పడటం, జిగురుతో కూడిన విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరితే ముక్కు నుంచి చీము కారడం, నోటిలోని చిగుళ్లపై, నాలుకపై పుండ్లు పడటం వంటివి జరుగుతాయి.ఆకలి మందగించడం, మేత మేయకపోవడం, అధిక విరేచనాలతో పాటు దగ్గుతో కూడిన బ్రాంకో నిమోనియా వంటి లక్షణాలతో 5 నుంచి 10 రోజుల్లో జీవాలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. చనిపోయిన జీవాలకు శవపరీక్ష చేసినప్పుడు చిన్న పేగులు, పెద్ద పేగుల్లో రక్తపు చారలు కనిపిస్తాయి. దీని ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. శ్వాసకోశ జీర్ణవ్యవస్థకు సంబంధించిన లక్షణాల ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చు. వ్యాధిగ్రస్థ

- మిగతా 8వ పేజీలో...

డ్రగ్స్ జీవితానికి అవరోధం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయికి బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వాడినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో 25 మందిపై డ్రగ్స్ కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కసారి డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ జరిగి కేసు నమోదైతే భవిష్యత్‌లో వారు ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులు కాదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా రోడ్ క్రాసింగ్ వద్దనే చోటుచేసుకున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, గ్లింపింగ్ లైట్లు వేయిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. సదస్సులో సీఐ, ఎస్ఐలు కే.నాగరాజు, దగ్గుల క్రాంతికుమార్, డీటీఆర్‌సీ సీఐ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల పాటలు ఆలోచింపజేశాయి.

మహిళా పోలీస్ సిబ్బందికి ఆత్మరక్షణ శిక్షణ


(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): మహిళా పోలీస్ సిబ్బందికి ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇస్తున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సెల్ఫ్ డిఫెన్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా పోలీస్ సిబ్బంది పురుష సిబ్బందితో సమానంగా ప్రజల్లోకి వెళ్లి విధులు నిర్వహించే సమయంలో వారికి ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ సీఐ రాము, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు డీజే ఏర్పాటుకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డుకు ఇరు పక్కల ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హాలియా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాను విజయవంతంచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాగార్జునసాగర్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా హాలియా సాయిమందిరంలో ఆయనకు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయిమందిరంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి సాయినాథుడి వెండి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వజ్రతేజ రైస్‌మిల్లును ఆయన సందర్శించారు. ఆయనకు యజమాన్యం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించింది. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు తేలపోలు శేఖర్, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు బానావత్ సక్రునాయక్, శివకుమార్, జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, భిక్షంరెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, ఎంతఃవోలు కృష్ణమూర్తి, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పథకంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



బొడ్డుపల్లి పీహెచ్‌సీలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రాథమిక ఆదాయం కలిగిన 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న కుటుంబ పెద్ద సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.20వేల వరకు ఆ కుటుంబానికి సాయం అందుతుందన్నారు. అంత్యోదయ, అన్న బీమాయోజన, జనశ్రీ బీమాయోజన కింద లబ్ధిపొందినవారు ఈ పథకానికి అర్హులుకాదన్నారు. పథకం కింద లబ్ధిపొందేందుకు దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. దరఖాస్తుతోపాటు మరణించిన వ్యక్తికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత గుర్తింపు పత్రం, చిరునామా రుజువు, తెల్లరేషన్‌కార్డు, జతచేయాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద జిల్లాకు 3,500 మందికి లబ్ధిచేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో టాంటాం వేయించి, అర్హుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని కోరారు. అందుకు తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ప్రారంభించాలన్నారు. దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి ఆర్డీవోకు సమర్పించాలని, ఆర్డీవోలు ఆన్‌లైన్‌లో డీఆర్‌వోకు పంపించాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తం వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

గ్రామీణ ప్రాంత ప్రజలకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యులను ఆదేశించారు. శనివారం మండలంలోని బొడ్డుపల్లి ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, ఈఎన్‌సీ, రిస్క్ రిజిస్టర్, ఐరన్, ఫోలిక్ మాత్రాల పంపిణీ, ప్రసవాలు, సీజనల్ వ్యాధుల వివరాలను డాక్టర్ విజయను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ముదిగొండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. కిచెన్‌లో నుంచి వెళ్లే వృథా నీటి కోసం ఓపెన్ డ్రైనేజీ ఉండడం, మురుగునీటి ఓపెన్ డ్రైనేజీ ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రిన్సిపాల్ హనుమాకుమారిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

• యూరియా కోసం బారులు



నిడమనూరు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం బారులుతీరిన రైతులు 7

సాగులో అధికారుల సూచనలు పాటించాలి



రాజవరం గ్రామంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో వ్యవసాయాధికారులు, నిపుణుల సూచనలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే కంపాసాగర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగయ్య, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీధర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ తెలిపారు. శనివారం స్థానిక మండల వ్యవసాయాధికారి గంటా హర్షితతో కలిసి మండలంలోని రాజవరం గ్రామంలో పర్యటించి రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం వరిపంట దుబ్బు చేసే దశలో ఉన్నందున కలుపు నివారణకు ట్రోపోమోన్ 20శాతం, ఇథోక్సి సల్ఫ్యూరాన్ 800 గ్రాములను ఎకరానికి లేదా సైహలోఫాప్ బ్యూటైల్, పెనాక్యులమ్ 40మి.లీ ఎకరానికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పచ్చదోమ నివారణకు థయోమిథాక్సమ్ లీటర్ నీటికి 0.25గ్రాములు, లేదా లీటర్ నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.3మి.లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో కలుపు నివారణకు రెండు నుంచి మూడు ఆకులు ఉన్న దశలో క్విజలోఫాప ఇథైల్ 2మి.లీ లేదా పైరిథైయోబాక్ సోడియం 1.25మి.లీను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే కలుపును నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరతకు
కేంద్రమే కారణం

ఎంపీ చామల



నార్కట్‌పల్లి-మాండ్ర బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల

నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ అలసత్వమే కారణమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి నుంచి మాండ్ర వరకు సుమారు రూ.14కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, కట్టంగూరు, నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్వో ప్లాంట్లను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా తన కోటా నిధుల కింద స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలో యూరియా కొరతపై పార్టీ ఎంపీ ప్రియాంకగాంధీతో కలిసి ఎంపీలు చేసిన ధర్నా ఫలితంగానే 50వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి కేటాయించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చపెడతామంటే కేసీఆర్‌కు భయమెందుకని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులకు చెందిన సీఎస్ఆర్ కింద అంబులెన్స్‌లు, ఆస్పత్రులకు కావాల్సిన వసతులను సమకూర్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నార్కట్‌పల్లి మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. నార్కట్‌పల్లి పెద్ద చెరువును రూ.30కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామన్నారు. చెర్వుగట్టు దేవస్థానాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మార్కెట్ వైస్‌చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, ఎస్‌కే.సమద్, దొండ రమేశ్, అల్గాసు మహేశ్, రాజు, ప్రజ్ఞాపురం సత్తి, మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, అయితగోని నర్సింహ, శివశంకర్, రాజు, వెంకన్న, పరమేశ్, శేఖర్, నారాయణ, స్వామి, గుత్తా మంజుల మాధవరెడ్డి, చెవుగోని రజిత శ్రీనివాస్, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వనమహోత్సవం

డిండి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా 100 మంది విద్యార్థులు పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చింత భిక్షమయ్య మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాను కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రాణవాయువును అందించేది మొక్కలేనని, అందుకే ప్రతీఒక్కరు మొక్కలు నాటాలన్నారు.

వీటీ నగర్‌లో 'శ్రావణ' పూజలు

చింతపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేంకటేశ్వరనగర్ సంతోషిమాత ఆలయంలో శ్రావణశుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు పట్టణానికి చెందిన మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పంచమృతాభిషేకం జరిపారు. అనంతరం లలితసహస్రనామావళి పఠనం చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

ఉత్సవాల్లో సామరస్యం వెల్లివిరియాలి

● గణేష్ మండప నిర్వహకులు బాధ్యతతో మెలగాలి ● శాంతి కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ ● అన్నివర్గాలు సహకరించాలి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో మతసామరస్యం వెల్లివిరియాలని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. శనివారం పట్టణంలోని ఐఎంఏ భవన్‌లో అన్ని పార్టీల నేతలు, మత పెద్దలు, గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజేలను ఉత్సవాలు, ఊరేగింపుల్లో నిషేదించినట్లు తెలిపారు. ఇతర మతాలను కించేపరిచే విధంగా పోస్ట్‌లు పెడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డివిజన్ పరిధిలో నాలుగు చోట్ల వేములపల్లి, వాడపల్లి, 14వ మైలు, దయ్యాలగుండిల వద్ద విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి అన్నివర్గాల సహకారం అవసరమన్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ విగ్రహాల వద్ద కాపలా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసాచారి, సీఐలు మోతీరాం, సోమనర్సయ్య, పీఎస్‌డీ ప్రసాద్, తహసీల్దార్ సురేష్‌కుమార్, కాంగ్రెస్ నేతలు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, దేశిరెడ్డి శేఖర్‌రెడ్డి, గోదాల జానకిరాంరెడ్డి, బిజెపి నాయకులు పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, నాయకులు పాల్గొన్నారు.

డిండి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డిండి సీఐ బీసన్న కోరారు. డిండి పోలీస్‌స్టేషన్‌లో పీస్‌కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా నిర్వాహకులు చూడాలన్నారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: వినాయక ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌కు పోలీస్‌శాఖ అనుమతిలేదని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌కు డీజే సౌండ్‌బాక్స్‌ల నిర్వాహకులను పిలిపించి సమావేశంలో మాట్లాడారు. డీజే సౌండ్‌బాక్స్‌ల నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): గణేష్ మండపాలకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నాంపల్లి సీఐ రాజు తెలిపారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పలు గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, రాజకీయ నాయకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. సమావేశంలో చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రాంమూర్తి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: శాంతిభద్రతల నడుమ కులమతాలకు అతీతంగా ప్రతీఒక్కరు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని తహసీల్దార్ రాగ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్, ఆయా శాఖల అధికారులు, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హాలియా: హాలియా పట్టణం, అనుముల మండల పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్.ఐ. సాయిప్రశాంత్‌లు తెలిపారు. హాలియా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన వారు మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద రోగులు అత్యవసర సమయాల్లో ఖరీదైన వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తోందన్నారు. మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెంకు చెందిన తెల్లబోయిన రాయులమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, తిప్పన రవిందర్‌రెడ్డి, మంద సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాదినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోందన్నారు. బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు చేపట్టడం లేదన్నారు. సాగర్‌రోడ్డుసహా పట్టణంలోని పలు కాలనీలలో వీధి దీపాలు వెలగడంలేదని, అంతర్గత రహదారులు పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయని కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. ఇక అండర్ గ్రౌండ్ పనుల పేరుతో పట్టణంలోని పలుచోట్ల తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాలు విస్తృతంగా కురుస్తున్నా.. మొక్కలు నాటడం లేదని, మొక్కల పంపిణీ ఊసే లేదన్నారు. వార్డులవారీగా పట్టణంలో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, రేపాల పురుషోత్తంరెడ్డి, వెంకటరమణ, వేణు, రవి, గిరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముప్వా రామారావు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్వ రామారావు అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారతరాజ్యాంగం - శాస్త్రీయ దృక్పదం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని అంశాలను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెల్‌ఫోన్లు, రీల్స్ పిచ్చిలో పడి కాలక్షేపం చేయరాదని, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. శిబిరానికి హాజరైన విద్యావేత్త కస్తూరి ప్రభాకర్ విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, సుదర్శన్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఉత్సవాలు ప్రారంభం

దేవరకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయచవితి పండుగ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వరకు జరుపుకోవాలని దేవరకొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుర్మేటి రవి ప్రసాద్‌శర్మ కోరారు. శనివారం దేవరకొండలో జరిగిన బ్రాహ్మణసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 5న గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని, ప్రజలంతా ఆనందోత్సవాలతో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో బ్రాహ్మణసంఘం గౌరవ అధ్యక్షుడు సురభి కృష్ణమూర్తి శర్మ, కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌శర్మ, వంశీకృష్ణ, భాస్కరశర్మ, కుర్మేటి భిక్షపతిశర్మ, సత్యనారాయణశర్మ, శశికుమార్, మాచాల శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు టైబెల్ట్‌లు అందజేస్తున్న లక్ష్మణ్‌నాయక్

వేములపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం అభినందనీయమని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఆమనగల్లు ప్రాథమిక పాఠశాలలోని 108 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన పిల్లల సందీప్ సుమారు రూ.6వేలతో విద్యార్థులకు టైలు, బెల్ట్‌లు అందించగా వాటిని ఆయన విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు రాధా, ఉపేందర్, సైదులు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సమీర్

మిర్యాలగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సమీర్ ఎన్నికయ్యారు. ఇటీవల నల్లగొండలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చూస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైనికుల కుటుంబాలకు చేరేవిధంగా కృషి చేస్తానన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హాలియా, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) అనుముల మండల అధ్యక్షుడు రేణికుంట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం అనుముల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సెప్టెంబర్ 1, 2024 తర్వాత నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తపస్ అనుముల మండల కార్యదర్శి గుర్రం సత్యనారాయణరెడ్డి, మండల కమిటీ సభ్యులు అక్కయ్య బాబు, మలిగిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమిరె సైదుల, బద్దెల అంజయ్య, బొమ్మ రవి, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బీటీ రోడ్లను తక్షణమే ఏర్పాటు చేయాలి



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

మాడ్గులపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి అనుసంధానం చేస్తూ బీటీ రోడ్లను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. శనివారం సీపీఎం నాయకులు మండలంలోని గజలాపురం, అభంగాపురంతోపాటు పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో బీటీ రోడ్లు లేక అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు భాగస్వాములై మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి డి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు గ్రామాల్లోని సమస్యలను అధికారులు పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా వైద్య శాఖ అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రాథమిక కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీసెంటర్లలో మెనూ సక్రమంగా అందే విధంగా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లోని వీధుల్లో, మురుగుకాల్వలు, శానిటేషన్, ఫాగింగ్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సంగీత, ఏవో శివరాంప్రసాద్, వెటర్నరి డాక్టర్ వినయ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఆర్‌డబ్లుఎస్ ఏఈ భవాని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పత్రాల అందజేత



దివ్యాంగులకు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో శేషగిరిశర్మ

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిశర్మ దివ్యాంగ అభ్యర్థులకు యూనిట్ గ్రాంట్ పత్రాలను అందజేసి మాట్లాడారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా స్వయంగా తమ వ్యాపారాన్ని తాము చేసుకునే విధంగా దోహదపడుతుందన్నారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కల్పన కోసం ఫౌండేషన్ మండలాన్ని యూనిట్‌గా తీసుకొని వివిధ గ్రామాల నుంచి అర్హులైన 16 మంది దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేసి వారు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి ఒక్కో అభ్యర్థికి రూ.25వేల విలువ చేసే కుట్టు మిషన్లు, పిండి మిల్లులు వంటివి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ పీఎస్.శ్రీనివాస్, డీపీఎం రామలింగయ్య, సీడీపీవో మమత, ఏపీఎం దిలీప్‌కుమార్, సాయితేజ, ఓంప్రకాశ్, మహేష్, మణికంఠ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి యాగం



ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

హాలియా, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీలోని స్వయం భూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకొని మహాలక్ష్మి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శ్రీలత రాఘవేంద్రరెడ్డి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీరామచార్యులు, స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యులు, స్థానిక భక్తులు, మహిళలలు తదితరులు పాల్గొన్నారు.

ఇక జీవాలకు టీకాలు

(5వ పేజీ తరువాయి)

జీవాల నుంచి రక్త నమునాలను చనిపోయిన జీవాల నుంచి పేగుల్లోని శోషరస కణుతులను, ఊపిరితిత్తులు, ప్లీహం వంటి నమునాలను సేకరించి ప్రయోగశాలకు పంపిన అనంతరం జీవాలు చనిపోవడానికి కారణాలు తెలుసుకొని వ్యాధి నిర్ధారణ చేస్తారు.

వ్యాధి నివారణ, చికిత్స

పీపీఆర్ అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలను వెంటనే ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. కొత్తగా కొనుగోలు చేసిన జీవాలను కొన్ని రోజులు వేరుగా ఉంచి వ్యాధి లేదని నిర్ధారించిన తరువాతే మందలో కలపాలి. ఈ వ్యాధిని నివారించేందుకు అది సోకక ముందే పీపీఆర్ టీకాలు వేయించాలి. ఈ వ్యాధి సంవత్సరంలోపు మేకలు, గొర్రె పిల్లల్లో అధికంగా వస్తుంది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా టీకాలు వేయించాలి. టీకాలను నాలుగు నెలలు, ఆపై వయసు ఉన్న గొర్రెలు, మేకలన్నింటికీ ఒక మిల్లీలీటర్ చొప్పున చర్మం కింద చేయించాల్సి ఉంటుంది. దీంతో పీపీఆర్ వ్యాధిని అరికట్టవచ్చు. ఈ వ్యాధికి సరైన చికిత్స లేనందున రైతులు పశువైద్యులను సంప్రదించి జీవాలకు చికిత్స అందించడం వల్ల కాపాడుకునే వీలుంటుంది. పశువైద్యుల సలహా మేరకు వ్యాధి లక్షణాలను బట్టి యాంటీబయాటిక్ మందులు, యాంటీ ఫైరటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. నోటి పుండ్లు తగ్గడానికి బోరిక్ యాసిడ్ కలిపిన గ్లిజరిన్‌ను పోయడంతో పాటు మేత మేయని జీవాలకు జావా, అంబలి తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

టీకాలను వేయించి జీవాలను కాపాడాలి

ఈనెల 26 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలను వేయిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జీవాలను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు ప్రాణాంతకమైన ఈ వ్యాధి నుంచి కాపాడటానికి టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు అందుకు సహకరించాలి. ప్రతి గొర్రెకు, మేకకు తప్పనిసరిగా టీకా వేయించాలి.

జీవీ.రమేష్, పశుసంవర్ధకశాఖ అధికారి

సీఎంఆర్‌లో జాప్యం!

(5వపేజీ తరువాయి)

సేకరించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, వాటిల్లో దాదాపు పూర్తి సామర్థ్యం మేర నిల్వలు పేరుకుపోయాయి. వీటిలో కనీసం ఇప్పుడు యాసంగి సీఎంఆర్‌కు సంబంధించిన బియ్యం ఇంకా మిల్లుల వద్దే నిల్వ ఉంది. సుమారు 2,15,662 మెట్రిక్‌టన్నుల బియ్యం వరకైనా నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను అందుబాటులోకి తేవాలని, ఆ మేరకైనా ఎఫ్‌సీఐ కోటా బియ్యం తీసుకెళ్లేలా ఒత్తిడి చేయాలని అధికారులను మిల్లర్లు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎఫ్‌సీఐకి లేఖలు రాశామని, అదేవిధంగా రాష్ట్ర సివిల్‌సప్లయిస్‌శాఖ ఉన్నతాధికారులకు సైతం పూర్తి వివరాలతో నివేదించామని, ఈ వారంలో ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎఫ్‌సీఐ బియ్యం తరలించకపోతే కనీసం ప్రైవేట్ గోదాములనైనా అద్దెకు తీసుకొని బియ్యం తీసుకెళ్లాలని మిల్లర్లు కోరుతున్న పరిస్థితి నెలకొంది.

సీఎంఆర్ సేకరణపై దృష్టిసారించాం

జిల్లాలో వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ 91శాతం సేకరించాం. మిగిలిన 9శాతం బియ్యాన్ని వచ్చే నెల 12లోగా పూర్తిచేస్తాం. యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌పై కూడా దృష్టి సారించాం. ఎఫ్‌సీఐ కోటాకు సంబంధించిన బియ్యం తీసుకెళ్తే గోదాముల సమస్య తీరుతుంది. అందుకోసం ఎఫ్‌సీఐని సంప్రదించడంతో పాటు, ఉన్నతాధికారులకు విషయం తెలియజేశాం. త్వరలోనే గోదాముల సమస్య పరిష్కరించి, యాసంగి సీఎంఆర్ కూడా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

వెంకటేశ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ఎర్రకేతనం.. సురవరం ఆశయాలు సాధించాలి

● కమ్యూనిస్టుగా కడదాక పేదల పక్షమే ● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



దేవరకొండలో సురవరం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రకేతనం.. సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలు సాధించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ఎర్రజెండా బాటలో నడక ప్రారంభించి ఉద్యమాల్లో ప్రజలను కూడగడుతూ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతూ నాయకత్వ బాధ్యతలు చేపట్టారన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో, బయట పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతి, షమీం, బంటు రాజేశ్వరి, సులోచన, శ్రీనివాసరెడ్డిపరమేశ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. సురవరం మృతికి ఆయన సంతాపం ప్రకటించి మాట్లాడారు. విలువలు కలిగిన గొప్పనాయకుడు సురవరం అన్నారు. సురవరం మృతికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, పల్లా సులోచన, దేప సుదర్శన్‌రెడ్డి, జ్యోతిబసు, పల్లా రంగారెడ్డి, మైనొద్దిన్, వెంకట్రాములు, నీల వెంకటయ్య, ఆకుల వెంకట్రాములు, ఆకుల రఘుమయ్యతోపాటు సీపీఐ, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

డిండి: సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సీపీఐ డిండి మండల సమితి నివాళులు అర్పించారు. సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వంకేశ్వరం చక్రి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమళ్ల నవీన్, డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్, ఎడ్ల శ్రీను, జంగయ్య, జగన్, సాగర్ పాల్గొన్నారు.

చింతపల్లి: సురవరం సుధాకర్ రెడ్డి మృతికి మండలంలోని సీపీఐ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐతపాక సైదులు, పోలే లాలయ్య, మిడిదొడ్డి వెంకటయ్య, వడ్డపల్లి భిక్షయ్య, జంగయ్య, అబ్బయ్య, రామకృష్ణ, గోపాల్, శివకుమార్ పాల్గొన్నారు.

పార్టీకి తీరని లోటు : మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు

సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటు అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు తెలిపారు. హైదరాబాద్‌లోని మఖ్దుంభవన్‌లో సుధాకర్ రెడ్డి మృత దేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.